

# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక







సంపుటి: 3 సంచిక: 318 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు గురువారం, 10 సెప్టెంబర్ 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 318 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR THURSDAY, 10 SEPTEMBER 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన

15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన



2లో

## స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. నోటీసు ఎలా ఇస్తారు?

- గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



2లో




2లో

## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
- నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు
- దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు
- 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం
- తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం
- 4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు
- పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం
- రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

## ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా...

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేస్తాం

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

కోనసీమలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ



2లో






## నవ్యాంధ్ర పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి ప్రాచుర్యం

● నవ్యాంధ్రలో తొలిసారిగా 41వ 'ఐఏటీఓ' జాతీయ సదస్సు" ● ఇండియా - ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" థీమ్‌తో సదస్సు నిర్వహణ

**విశాఖపట్నంసెప్టెంబర్ 09:** ఆంధ్రప్రదేశ్ లో బాధ్యతాయుతమైన, పర్యావరణహిత పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో, కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో రాష్ట్రంలో పర్యాటక విప్లవం ఆవిష్కృతమవుతోందని ఆయన మిగతా2లో...

## గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

- కళాశాలను ఏర్పాటు చేసింది టీడీపీ.. నిర్వీర్యం చేసింది వైసీపీ
- ఆరు నెలల్లో 253 బోధనా పోస్టుల భర్తీ.. వీసీఐ అనుమతుల పునరుద్ధరణ
- వైసీపీ నేతలు ముందు తమ ఐదేళ్ల పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలి:
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, సెప్టెంబర్ 09:** గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు లభించకపోవడంపై వైసీపీ నేతలు మాట్లాడటం చూస్తుంటే... అసలు వారికి ఆ అంశంపై మాట్లాడే నైతిక హక్కు ఎవరు ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కళాశాల అభివృద్ధిని పట్టించుకోని వారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రజలకు మెరుగైన పశువైద్య సేవలు అందించడంతో పాటు, ఈ ప్రాంతంలో వెటర్నరీ విద్యను అభివృద్ధి చేయాలనే మిగతా2లో...



## ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు

- రహదారుల అభివృద్ధికి రూ. 300 కోట్ల మంజూరు
- ఆర్థిక శాఖ ఆమోదం
- ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి, సెప్టెంబర్ 09:** సీఎం చం ద్రబాబు ఆదేశాల మేరకు రోడ్ల అభివృద్ధికి రూ. 300 కోట్లకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు మంత్రి బి.సీ. జనార్ధనరెడ్డి తెలిపారు. ఈ నిధులతో గోదావరి పరిసర ప్రాంతాల్లోని

మిగతా2లో...

## ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన ఏపీ వక్ఫ్ బోర్డు

- తాలీమ్-ఎ-హునర్ కు అంతర్జాతీయ గుర్తింపు.
- అధికారికంగా రికార్డ్ హోల్డర్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు.
- విద్యా రంగంలో వినూత్న కార్యక్రమానికి అరుదైన గౌరవం.
- ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్



**అమరావతి, సెప్టెంబర్ 09:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చరిత్రలో మరో అరుదైన ఘనత నమోదైంది. పేద, ప్రతిభావంతమైన ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించేందుకు చేపట్టిన ప్రతిష్టాత్మక తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమాన్ని గుర్తిస్తూ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును అధికారికంగా రికార్డ్ హోల్డర్ గా ప్రకటించింది. మోస్ట్ మెరిటోరియస్ మిగతా2లో...

## ఏపీలో విద్యుత్ వాహనాలకు మరింత ప్రోత్సాహం

● ఈవీ పాలసీతో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు బలమైన పునాది ● విద్యుత్ వాహనాల కొనుగోలుపై 5 శాతం రాయితీ

● ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు

● రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి




2లో

## అసెంబ్లీ సమావేశాలు..తొలి రోజు సంఘటనలపై ప్రత్యేక విచారణ

- సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్: సెప్టెంబర్ 09:** అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా తొలి రోజు చోటుచేసుకున్న సంఘటనలపై ప్రత్యేకంగా విచారణ జరిపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమగ్ర విచారణ కోసం జాయింట్ సీపీ విజయ్ కుమార్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మిగతా2లో...



# ప్రతి వారం ప్రజల మధ్యనే ఉంటా...

**అమరావతి, , సెప్టెంబర్ 09:** సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి – మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు."రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు.భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి (1908) 22ఏ(1) నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నామని, దీని ద్వారా 1410 మందికి చెందిన 56.37 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నామని ప్రకటించారు. "గొడ్డలి పార్టీ తారుమారు చేసిన రికార్డులను ప్రక్షాళన చేసి భూ సమస్యలను కొలిక్కి తెస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.భూమి భద్రతతో పాటు నీటి భద్రతకు కూడా తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో వృథాగా కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# నవ్యాంధ్ర పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి ప్రాచుర్యం

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు.విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఈ నెల 10 నుండి 12 వరకు విశాఖ వేదికగా జరగనున్న 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ సదస్సు వివరాలను మంత్రి దుర్గేష్ మీడియాకు వెల్లడించారు.సెప్టెంబర్ 13న ఐఏటీఓ సభ్యుల కోసం ఏపీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో 6 ప్రత్యేక 'పోస్ట్ కన్వెన్షన్' టూర్లు ఏర్పాటు చేశామన్నారు. నవ్యాంధ్రలో తొలిసారిగా ప్రతిష్ఠాత్మక 'ఐఏటీఓ' జాతీయ సదస్సు..గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా ఏపీఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. భారతదేశంలో ఇన్-బౌండ్ టూరిజం అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రతిష్ఠాత్మక 41వ జాతీయ సదస్సును ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తోందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. "ఇండియా – ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" అనే ముఖ్య థీమ్ తో జరుగుతున్న ఈ సదస్సులో దేశవ్యాప్తంగా 1,000 మందికి పైగా పర్యాటక రంగ ప్రతినిధులు, ప్రముఖ టూర్ ఆపరేటర్లు, విధాన నిర్ణేతలు మరియు పారిశ్రామికవేత్తలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2,068 కంటే ఎక్కువ మంది ప్రతినిధులతో ఇన్-బౌండ్ టూరిజంలో అగ్రగామిగా ఉన్న ఐఏటీఓ ) జాతీయ సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకసారి జరిగిన ఈ సదస్సు, నవ్యాంధ్రప్రదేశ్ ఆవిర్భావం తర్వాత జరగడం ఇదే తొలిసారి అని తెలిపారు.ఈ వేదిక ఏపీ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి దోహదపడుతుందన్నారు.రేపు (గురువారం) సాయంత్రం జరిగే ఐఏటీఓ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.అదే విధంగా కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి భువనేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు మరియు పర్యాటక రంగ ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ 1000కి.మీలకు పైబడిన సుదీర్ఘ సముద్ర తీరం, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం, అరకు లోయ, గిరిజన సంస్కృతి, బౌద్ధ క్షేత్రాలు మరియు సహజ సౌందర్యాన్ని అంతర్జాతీయ పర్యాటక పటంలో నిలపడానికి వేదిక సుగమమైందన్నారు.

# గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశంతో 2016లో గరివిడిలో వెటర్నరీ కళాశాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమే అని అచ్చెన్నాయుడు తెలిపారు. 2017 ఏప్రిల్‌లో రూ.81.72 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశామని, 2018 ఫిబ్రవరిలో సుమారు 90 ఎకరాల భూమిని కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించామని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన ఐదేళ్ల సమయం అధికారంలో ఉన్న వైసీపీ ఏం చేసింది? అని మంత్రి నిలదీశారు. ఐదేళ్లలో ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా?అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చారా? వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించారా? నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారా? కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారా? ఈ ప్రశ్నలకు వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.2024 ఆగస్టు నాటికి పూర్తికావాల్సిన నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తి కాలేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని స్పష్టం చేశారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ప్రధాన లోపాలు లేవని తాజా వీసీఐ పరిశీలన స్పష్టం చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, బాలురు, బాలికల వసతిగృహాల నిర్మాణ పనులను పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 99 శాతం మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని తెలిపారు.కళాశాలలో సిబ్బంది కొరతను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వీసీఐ సూచనల మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి మొత్తం బోధనా సిబ్బంది సంఖ్యను 77కు పెంచామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రెగ్యులర్ నియామక ప్రక్రియలో ఆలస్యం జరిగిందని, అయితే ఆరు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తి చేసి వీసీఐ అనుమతులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం గత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మంత్రి మండిపడ్డారు. గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైన బోధనా సిబ్బంది నియామకాలను పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఇకనైనా వైసీపీ నేతలు విమర్శలు చేసే ముందు తమ ఐదేళ్ల పాలనను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు.

# ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన ఏపీ వక్ఫ్ బోర్డు

(మొదటి పేజీ తరువాయి)

స్టూడెంట్స్ గాట్ ఫ్రీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ (మాస్) విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు పేరును సంస్థ తన అధికారిక రికార్డుల్లో నమోదు చేసి, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లోనూ ప్రచురించింది. ఈ సందర్భంగా ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డు విద్యా రంగంలో చేపట్టిన తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం ఎంతో గర్వకారణం. ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల కలలు ఆగిపోకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇప్పుడు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో ఏపీ వక్ఫ్ బోర్డు అధికారిక రికార్డ్ హోల్డర్‌గా స్థానం సంపాదించడం మా కృషికి లభించిన గొప్ప గుర్తింపు అని తెలిపారు. ఈ విజయం కేవలం వక్ఫ్ బోర్డుదే కాదు. తాలీమ్-ఎ-హునర్ ద్వారా కొత్త భవిష్యత్తును నిర్మించుకుంటున్న ప్రతి విద్యార్థిదీ. ఈ గుర్తింపు మాపై మరింత బాధ్యతను పెంచింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టి పేద, ప్రతిభావం తమైన విద్యార్థులకు అండగా నిలుస్తాం" అని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో, మంత్రి నారా లోకేశ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ప్రోత్సాహం, సహకారంతో వక్ఫ్ బోర్డు విద్యా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు.

# అసెంబ్లీ సమావేశాలు..తొలి రోజు సంఘటనలపై ప్రత్యేక విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఫామ్‌హౌస్‌లో ఉండి కుట్రలు చేసేవారిపైనా చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. అసెంబ్లీ ఘటనకు సంబంధించి క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ జరిపిస్తామని చెప్పారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ బాధ్యతగా వ్యవహరించలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. దళితులు తిరిగిన ప్రాంతాన్ని శుద్ధి చేసి ఉన్మాదాన్ని చాటుకున్నారని మండిపడ్డారు. జరిగిన తప్పిదాన్ని గుర్తించి దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చేసిన తప్పును సరిదిద్దుకుని క్షమాపణ చెబితే వారి కిరీటం కిందపడుతుందా? అని ప్రశ్నించారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

**అమరావతి, సెప్టెంబర్ 09:**ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా..నోటీసు ఎలా ఇస్తారు?

**హైదరాబాద్: సెప్టెంబర్ 09:**
జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల్లో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. వాటిని ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. 'ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఓ మేజిస్ట్రేట్‌కు అలా చేయడానికి ఎంత ధైర్యం?' అని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపారు.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

**న్యూఢిల్లీ,, సెప్టెంబర్ 09:** దేశంలోని ఏడు కీలక రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమైన క్యాబినెట్ కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణలో ఒక ప్రాజెక్టుకు, ఏపీలో ఒక ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడిం చారు. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బిలాస్‌పూర్-కాంతి నగరాలను కలుపుతూ ఈ ప్రాజెక్టులు ఉండనున్నాయి. ఇప్పటికే మూడు రైల్వే లైన్లు ఉన్న పలు ప్రాంతాల్లో నాలుగో లైన్ ఏర్పాటుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే రూ.2,000 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, మరో 5,000 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయని, వీటికి ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. అలాగే, మరో 4,000 కిలోమీటర్ల మేర పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు.తెలంగాణకు సంబంధించి ఒక ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఇది ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల పొడవైన నాలుగో లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీని విలువ రూ.2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ధరించింది. ఏపీకి సంబంధించి అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3,4 లైన్ల నిర్మాణం జరగనుంది. మొత్తంగా దక్షిణాదికి సంబంధించి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం అంగీకరించింది.

# ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

6 జిల్లాల్లో 78 రోడ్ల మరమ్మతులు, పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణకై ఈ నిధులు కేటాయింపు జరిగినట్లు చెప్పారు.తూర్పు ,పశ్చిమ గోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పోలవరం, ఏలూరు జిల్లాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.
రూ. 300 కోట్ల నిధులుతో దాదాపు 431 కి.మీ మేర స్టేట్ హైవే జిల్లా ప్రధాన రోడ్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. స్టేట్ హైవే లకు సంబంధించి 275 కి.మీ మేర 41 రోడ్ల పనులకు రూ.185.75 కోట్ల నిధులు , జిల్లా ప్రధాన రహదారులు సంబంధించి 155 కి.మీ మేర 37 రహదారులకు రూ. 114.25 కోట్ల నిధు లు కేటాయింపు జరిపినట్లు మంత్రి చెప్పారు. రూ. 300 కోట్ల నిధులతో గోదావరి తీరంలో 6 జిల్లాల్లో ఆర్ అండ్ బీ రోడ్ల రూపురేఖలు మారతాయని చెప్పారు. గోదావరి పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యంగా భారీగా ఈ నిధుల కేటాయింపు జరిగినట్లు తెలిపారు.

# ఏపీలో విద్యుత్ వాహనాలకు మరింత ప్రోత్సాహం




**తాడేపల్లి, , సెప్టెంబర్ 09:**ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న నిబద్ధతతో రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని మరింతగా పెంచేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. 2024–29 సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా విద్యుత్ వాహనాల తయారీదారులతో పాటు కొనుగోలుదారులకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్ల కొనుగోలుపై ఎక్స్‌షోరూమ్ ధరలో 5 శాతం వరకు రాయితీ కల్పించామని తెలిపారు. ఈ ప్రోత్సాహకం 2027 మార్చి వరకు వర్తిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకునే విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు కల్పించడం ద్వారా ప్రజలు ఈవీల వైపు మళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించేందుకు తొలి 5,000 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఖర్చులో 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ప్రోత్సాహకం అందిస్తున్నామని తెలిపారు. **దేశవ్యాప్తంగా ఈవీలకు పెరుగుతున్న ఆదరణ** దేశంలో విద్యుత్ వాహనాల విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆగస్టులో దేశవ్యాప్తంగా సుమారు 2.98 లక్షల విద్యుత్ వాహనాలు విక్రయించబడటం, గత ఏడాదితో పోలిస్తే 52.9 శాతం వృద్ధి నమోదవడం ఈ రంగానికి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమన్నారు. మొత్తం వాహన మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరగడం భవిష్యత్ రవాణా వ్యవస్థలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ ద్విచక్ర వాహనాలు, కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త విద్యుత్ కార్లను ప్రోత్సహించడంతో పాటు ప్రజా రవాణాలో ఈవీల వినియోగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒక విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులోకి తీసుకురావడం, ఈ-మొబిలిటీ నగరాల అభివృద్ధి, స్టార్టప్‌లకు ప్రోత్సాహం వంటి చర్యలు రాష్ట్రంలో పర్యావరణహిత రవాణా వ్యవస్థకు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

భారత్
# ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

గుంటూరు వార్తలు
గురువారం, 10 సెప్టెంబర్ 2026



## వైభవంగా ఎన్నారై టిడిపి కేంద్ర కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం

**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నూతనంగా ఎన్నికైన ఎన్నారై టీడీపీ కేంద్ర కమిటీ విభాగానికి చెందిన 45 సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ,ప్రపంచ దేశాలలో తెలుగువారు లేని దేశాలు లేవు అంటే అతిశయోక్తి కాదన్నారు. అది తెలుగు జాతి గొప్పతనం. తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన అన్న నందమూరి తారక రామారావు ఆలోచనలు, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లే బాధ్యత మన అందరిపై ఉంది. విద్యావంతులు, వైద్యులు, అడ్వకేట్లు వంటి వారిని టిక్కెట్లు ఇచ్చి అసెంబ్లీకి నడిపించిన ఘనత అన్న నందమూరి తారక రామారావుది అయితే, 1999లో 119 మంది విద్యావంతులకు టిక్కెట్లు ఇచ్చి అసెంబ్లీకి నడిపించిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది. అదేవిధంగా ఇప్పుడు ఎందరో ఎన్నారైలకు కూడా ప్రజాప్రతినిధులుగా టిడిపి అవకాశం కల్పించింది. అందులో భాగంగానే పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో గెలిచి, హెచ్ఎంఓఎస్ గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని, అక్రమ పాలనను సోషల్ మీడియా వేదికగా కడిగిపారేసింది మన ఎన్నారైలు. మన జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేస్తే 55 దేశాలలో మన ఎన్నారైలు గొంతెత్తి ప్రశ్నించారు, నిలదీశారు. కొంతమంది కొన్ని వేల డాలర్ల సొంత డబ్బును ఖర్చు పెట్టుకుని ఎన్నారైలు వేలాదిగా తరలివచ్చి 2024 ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందుకే మిమ్మల్ని ఎన్నారై లుగా కాదు, ఎమ్మార్ఐ – మోస్ట్ రిలయబ్లె ఇండియన్స్ గా నేను గుర్తుంచుకుంటాను. మన ఎన్నారై లు దేశాన్ని వదిలి వెళ్ళినా సరే, తెలుగుదనాన్ని, తెలుగు సంప్రదాయాన్ని మర్చిపోలేదు. మీ పిల్లలను తెలుగు భాషను మరవనివ్వలేదు. ఇది నిజంగా అభినందనీయం. అలాంటి ఎన్నారైలకు సహాయ సహకారాలు అందించడానికి టీడీపీ నిరంతరం కృషి చేస్తుంది. ఇటీవల జరిగిన యుద్ధాల్లో గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా వెనక్కు తీసుకొచ్చిన ఘనత టీడీపీదే. మీరందరూ తెలుగుదేశం బ్రాండ్ అంబాసిడర్లు. మనందరి నినాదం తెలుగురాష్ట్రాన్ని నెంబర్ – 1 స్థానంలో నిలబెట్టడమే. కార్యకర్తలు చేస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని మైటీడీపి యాప్. లో అప్లోడ్ చేయండి. గురు రాజాపై ఇక నుంచి బాధ్యత పెరిగింది. ప్రతీ 10 మంది ఎన్నారైల సమూహంలో ఒక టిడిపి ఎన్నారై సభ్యుడు ఉండేలా మనం పని చేయాలి. సరిగ్గా మూడేళ్ల క్రితం స్కిల్ డెవలప్మెంట్ అవినీతి పేరుతో తెల్లవారుజామున మూడు గంటలకు నారా చంద్రబాబునాయుడుని గత ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసింది. తొలుత రూ. 300 కోట్లు అవినీతి అన్నారు, తరవాత రూ. 100 కోట్లు అన్నారు, చివరితో రూ. 30 కోట్లు అన్నారు. ఒక్క రూపాయి అవినీతి కూడా చూపించలేకపోయారు. ప్రజలకు నేను చంద్రబాబు నాయుడుని కలవడానికి తొలిసారి రాజమండ్రి జైలుకు వెళ్ళినప్పుడు, అక్కడ చంద్రబాబు చేత నిర్మింప చేసిన భవనాలు, ఇతర నిర్మాణాల శంకుస్థాపనల ఫలకాలను చూసి నిజంగా చాలా బాధనిపించింది.ఆరోజు ప్రతి కార్యకర్త అండగా నిలబడ్డారు. పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించారు. కష్టకాలంలో నిలబడ్డ ఏ కార్యకర్తను కూడా తెలుగుదేశం పార్టీ మరిచిపోదు. చంద్రబాబు నాయుడు ఏ రోజు తప్పు చేయలేదు అదే ఆయనకు, మా కుటుంబానికి అండగా, శ్రీరామరక్షగా నిలబడిందని తెలియజేశారు.

**పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ,** దూరం పెరిగినా, దేశ భక్తి వదలని, దేశం మారినా, తెలుగుదేశం జెండా వదలని, ఎన్నారై సోదర, సోదరీమణులకు నా నమస్కారాలు. సంపాదనను కూడా పక్కనపెట్టి, పార్టీనే ముఖ్యమని నమ్మి టిడిపి అభ్యున్నతికి కృషిచేసిన గురురాజాకి ఇది ఒక సముచిత స్థానం. అమెరికాకు అందరికంటే ముందుగా వెళ్లి, అమెరికాకు వెళ్లిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటూ ఎన్ఆర్ఐ అంటే ఆయనే అంటూ గౌరవం అందుకుంటున్న కోమటి జయరాంకి, టిడిపి కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు. ఈరోజు ఈ కార్యక్రమం ఒక ప్రమాణ స్వీకార కార్యక్రమంలా కాక పండుగ వాతావరణంలో జరగడం నిజంగా అభినందనీయం. ముఖ్యమంత్రిగా ఎంతమంది నాయకులు మారినా సరే సాంకేతికతను ప్రోత్సహిస్తూ ఇంజనీరింగ్ కాలేజీలను పెంచుతూ, ఐటీ విభాగానికి ప్రత్యేక స్థానం కల్పించిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. అలాంటి నాయకుడిని మన తెలుగు చరిత్ర ఎప్పటికీ మర్చిపోకూడదు. 2024 ఎన్నికల్లో ఎన్నారైలు పోషించిన పాత్ర అనిర్వచనీయం. దొంగ ఓట్లు గుర్తించడం గాని, ప్రచార బాధ్యతలు చేపట్టడం గానీ, గడప గడపకు తెలుగుదేశం ఉద్దేశాలను లక్ష్యాలను తీసుకెళ్లడంలో గాని ఎన్నారై సోదర సోదరీమణులు తీసుకున్న చొరవ, చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిది. అలాంటి ఎన్ఆర్ఐ లను మరిచిపోకుండా ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత మన టిడిపి పార్టీకే దక్కుతుంది. రాష్ట్రంలో ఏడుగురు ఎన్నారై లకు ప్రజాప్రతినిధులుగా స్థానం కల్పించింది. టీటీడీ బోర్డు మెంబర్ గా అలాగే అక్కడ సౌకర్యాలలో కూడా ప్రత్యేక స్థానం కల్పించారు. ఈ నేపథ్యంలో ఏర్పడిన ఏర్పాటు చేసిన ఎన్నారై టిడిపి కేంద్ర కమిటీ విభాగ సభ్యులు విదేశాల్లో ఉన్నటువంటి మన ఎన్ఆర్ఐ సోదరులందరితో సత్సంబంధాలను ఏర్పరచుకోవాలి. గడిచిన 5 ఏళ్లలో ఎన్నారైలు పనిచేసిన తీరు ఒక ఎత్తు అయితే, ఇపుడు చేయాల్సిన బాధ్యత మరో ఎత్తని తెలియజేశారు.

**గురు రాజా మాట్లాడుతూ,**అన్న ఎన్టీఆర్ నాయకత్వంతో మొదలైన నా అభిమానం అమెరికాకు వెళ్లినా సరే నా అనుబంధం నా తెలుగు నేలతోనే ముడిపడి ఉంది. అందులను ఈరోజు నేను స్వీకరిస్తున్నది పదవి మాత్రమే కాదు, ప్రభాస ఆంధ్రుల ఆలోచనలను మోసుకు రాగల మహత్తర బాధ్యత.యువగలం కార్యక్రమాన్ని పాదయాత్రకు వెళ్తున్న నారా లోకేష్ కి తెలగం దిద్దుతూ మేము ‘శిల గా అడుగుపెడుతున్నారు శిల్పంలా మారి రావాలని’ కోరుకున్నాము. ఇది మామూలు సెలగా కాదు నారా – నందమూరి రక్తంతో తయారైన అద్భుతమైన శిల గా రూపుదిద్దుకున్నారు నారా లోకేష్. తెలుగుదేశం పార్టీ విజయమే తెలుగు రాష్ట్ర ప్రజల కు శ్రీరామరక్షగా మనం ఎప్పటికప్పుడు తెలుగుదేశాన్ని తీర్చిదిద్దుకుంటూ, గెలిపించుకోవాలని తెలియజేశారు. ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ,ఎన్నారై టీడీపీ సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచు వేణుగోపాల్ రెడ్డి సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ ఎం ఈ , సెర్ప్ ,ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎన్నారై టీడీపీ సెంట్రల్ కమిటీ ప్రెసిడెంట్ గురు రాజా, వైస్ ప్రెసిడెంట్ కోమటి జయరాం, కమిటీ సభ్యులు, ఏపీ ఎన్నార్టీ ప్రెసిడెంట్ వేమూరి రవి తదితరులు పాల్గొన్నారు.




## మట్టి విగ్రహాల తయారీ విద్యార్థుల్లో పోటీ కాదు : జిఎంసి కమిషనర్

**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ ఈ నెల 11న ఏకకాలంలో 25 వేల మంది విద్యార్థులతో రికార్డ్ స్థాయిలో గ్రీన్ గణేష్ మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమం విద్యార్థుల్లో పోటీ కాదని, పర్యావరణంపై అవగాహన కల్గిస్తూ, నవ గుంటూరు నిర్మాణంలో భాగస్వామ్యం చేయడమేనని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో నగరంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, విద్యా శాఖ, జిఎంసి అధికారులతో “గ్రీన్ గణేష్” మట్టి వినాయక ప్రతిమల తయారీ (వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్) కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల వలన భూమి, నీరు, గాలి కలుషితమై ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంద న్నారు. పండగలు పర్యావరణ హితంగా జరిగి భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణంని అందించే కృషిలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఏకకాలంలో విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమల తయారీకి పూనుకుందన్నారు. విద్యార్థుల్లో పర్యావరణంపట్ల అవగాహన కల్గిస్తే రానున్న కాలంలో వారే పర్యావరణ పరిరక్షకులు అవుతారన్నారు. కనుక ఈ నెల 11వ తేదీన మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు నగరంలో సుమారు 60 పాఠశాలల్లో ఏకకాలంలో విద్యార్థులు స్వచ్ఛందంగా మట్టి విగ్రహాలు తయారు చేస్తారన్నారు. ఈ విధంగా చేయడం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ లో నమోదు అవుతుందని, ప్రతి పాఠశాలలో విద్యార్థులు ఎక్కడికీ రాకుండా వారి పాఠశాల ప్రాంగణంలోనే జిఎంసి అందించే విత్తనాలు కలిపినా మట్టితో విగ్రహాలు చేయాలన్నారు. పాల్గొన్న విద్యార్థికి, పాఠశాలకు ప్రత్యేకంగా జిఎంసి నుండి అభినందన సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. కనుక నగరంలో జరిగే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఏ విద్యార్థిని బలవంతంగా కాకుండా స్వచ్ఛందంగా పాల్గొనేలా విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. తొలుత కమిషనర్ గ్రీన్ గణేష్ కార్యక్రమంని సెంట్రలైజ్డ్ గా పర్యవేక్షణ చేసే నగరపాలక సంస్థ ఎన్టీఆర్ స్టేడియంను జిఎంసి ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పరిశీలించి, ఏర్పాట్లపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డిసిపీ సూరజ్ కుమార్, ఉపా సెల్ పిఓ సింహాచలం, ఎంఈఓలు ఖుద్దూస్, నాగేంద్రం, జ్యోతి కిరణ్, షరీఫ్ పాల్గొన్నారు.




## హాజీల ఆరోగ్య భద్రతే లక్ష్యం : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) లోని నాట్కో సెంటర్ లో ప్రత్యేక ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది హజ్ యాత్రికులకు (హాజీలకు) బుధవారం స్థానిక జీజీహెచ్ లో ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సౌదీ అరేబియా ప్రభుత్వం, భారత హజ్ కమిటీ నిబంధనల ప్రకారం ప్రతీ యాత్రికుడు తప్పని సరిగా వ్యాక్సిన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు ఒకే చోట కలిసే సమయంలో ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా నిరోధించేందుకు ముందస్తుగా వ్యాక్సినేషన్ చేయిస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం ఆధ్వర్యంలో హాజీలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున అందిస్తున్నామన్నారు. గతంలో హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారని, ఇప్పుడు గన్నవరం నుంచే వెళ్లేలా ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ జీ.దుర్గాప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

## ‘నిజం గెలిచింది’.. చంద్రబాబు అక్రమ అరెస్టును చరిత్ర ఎప్పటికీ మర్చిపోదు




ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** చంద్రబాబు అక్రమ అరెస్టును చరిత్ర ఎప్పటికీ మర్చిపోదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సాయంత్రం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త “నిజం గెలిచింది” కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దీపాలు వెలిగించి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత, నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా, తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేసిన నారా చంద్రబాబు నాయుడిని రాజకీయ కక్షతో అక్రమంగా అరెస్టు చేయడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చీకటి అధ్యాయమన్నారు. ప్రజల సంక్షేమం, ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం నిరంతరం శ్రమించిన నాయకుడిని తప్పుడు ఆరోపణలతో జైలుకు పంపించి పైశాచిక ఆనందం పొందారని విమర్శించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసిన బూత్ కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, పార్టీ అధ్యక్షులను అభినందించారు. వారి సేవలకు గుర్తింపుగా సెప్టెంబర్ 13న వెలిగొండ ప్రాజెక్టు సందర్శనతో పాటు శ్రీశైలం మల్లన్న దర్శనం కల్పించే ప్రత్యేక పర్యటనను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. గణేష్ ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని యువతకు పిలుపునిచ్చారు. డీజేలు, అధిక శబ్ద కాలుష్యం, రోడ్లపై చెత్తాచెదారం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల చదువులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. భక్తి, ఆనందంతో పాటు సామాజిక బాధ్యతను కూడా గుర్తుంచుకుని వినాయక చవితిని జరుపుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తాగు నీటి చెరువులు నింపాలి : జిల్లా కలెక్టర్

**గుంటూరు, 08 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఎల్ నినో ప్రభావం దృష్ట్యా తాగునీటి సరఫరాకు సమస్యలు తలెత్తకుండా తాగు నీటి చెరువులు నింపాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. తాగు నీటి చెరువుల నిలువలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్షించారు. నాలుగు రోజులలో తాగు నీటి చెరువులు నింపాలన్నారు. వర్షాధారిత చెరువులు నింపడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఒగేరువాగు నింపడం ద్వారా దాని పరిధిలో ఉన్న గ్రామాలకు తాగు నీటిని అందించుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 75 శాతం కంటే ఎక్కువ నీరు నింపాల్సిన 50 చెరువులపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి) నుండి వస్తున్న నీరు ఎవరు ఎక్కడా దారి మళ్ళించే చర్యలు చేపట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ, పది రోజుల్లో లక్ష్యం మేరకు చెరువులలో నీరు నింపుట జరుగుతుందన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి) నుంచి గుంటూరు చానల్ కు నీరు విడుదల చేయడం ద్వారా దాని కిందన గల చెరువులు నింపుటకు అవకాశం ఉందని జలవనరుల శాఖ ఇంజనీర్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జలవనరుల శాఖ ఇంజనీర్లు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు పాల్గొన్నారు.

## విగ్రహాలను నిర్దేశించిన ప్రదేశాల్లో నిమజ్జనం చేయాలి : జిల్లా కలెక్టర్



**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విగ్రహాలను నిర్ణయించిన నిర్దేశిత ప్రత్యేక నిమజ్జన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ ) విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసిందని, వాటిని పాటించి పర్యావరణ హితానికి తోడ్పాటును అందించాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను జలాశయాలు, నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం జరుగుతుందని, తద్వారా నీటి నాణ్యత దెబ్బతింటుండటం ఆందోళనకరమైన అంశంగా ఉందన్నారు. క్లాస్–1 నగరాల పరిధిలో నీటి వనరుల నీటి నాణ్యతను మూడు దశల్లో – నిమజ్జనానికి ముందు, నిమజ్జనం జరుగుతున్న సమయంలో, నిమజ్జనం అనంతరం పర్యవేక్షించి అంచనా వేయాలని సూచించడం జరిగిందని వివరించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల్లో ముఖ్యంగా పర్యావరణహిత విగ్రహాలను ఉపయోగించాలన్నారు. రంగులు వినియోగిస్తే పర్యావరణ హిత రంగులు మాత్రమే వినియోగించాలని అన్నారు. అవసరమైన సౌకర్యాలతో తాత్కాలికంగా ప్రత్యేక నిమజ్జన కొలనులను ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. వినాయక మండపాలు నిర్వహించే వర్గాలతో సహా ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నీటి నాణ్యత దెబ్బతినకుండా నివారించుటకు సి.పి.సి.బి మార్గదర్శకాలను అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జి.ఎం.సి కమిషనర్ ను అభినందించిన కలెక్టర్



**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వాయు కాలుష్య నియంత్రణ లో విశేష ప్రతిభ కనబరిచి, కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన ‘స్వచ్ఛ వాయు సర్వేక్షణ్’2026లో గుంటూరు నగరం ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ అవార్డును అందుకున్న గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ ను బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అభినందించారు. దేశ వ్యాప్తంగా 130 నగరాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు నగరం పట్టణాల కేటగిరిలో ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. రాష్ట్ర స్థాయి కేటగిరీ 2 లో జిఎంసి తొలి స్థానంలో నిలిచింది. పర్యావరణ పరిరక్షణలో కృషి చేస్తూ మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాక్షించారు. గ్రీన్ గుంటూరు, నవ గుంటూరును సాధించి ప్రజల మనసులో నిలవాలని అన్నారు.

# మైలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం

### మాజీ మంత్రి జోగి రమేష్, దేవినేని అవినాష్



**ఇబ్రహీంపట్నం, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాబోయే ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గ గడ్డపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ మంత్రి జోగి రమేష్, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ లు ధీమా వ్యక్తం చేశారు. మైలవరంనియోజకవర్గ విస్తృత సమావేశం ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు వెంకటేశ్వరావు కళ్యాణ మండపంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి తిరుగులేదని, ప్రజా మద్దతు పూర్తిగా తమవైపే ఉందని క్యాడర్ స్పష్టం చేస్తోంది. సంక్షేమ పథకాలే మా ధైర్యమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వినూత్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసిన విధానమే తమను ప్రజ ల్లోకి ధైర్యంగా వెళ్లేలా చేస్తోందని వివరించారు. ప్రజల ముంగిటకే పాలనను తీసుకెళ్లడం వల్ల ఓటర్లు తమను నిండు మనస్సుతో ఆశీర్వదిస్తున్నారని, అదే తమ గెలుపునకు బలమైన పునాది అని ధీమా వ్యక్తం చేశారు.

**ప్రజల్లోకి వెళ్లేందుకు కూటమి నాయకుల జంకు :** మరోవైపు ప్రతిపక్ష కూటమి నాయకులు ప్రజల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారని మైలవరం వైఎస్సార్‌సీపీ నాయకత్వం ఎద్దేవా చేసింది. గతంలో వారు చేసిన తప్పులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ కపోవడం వల్ల ఓటర్లను ముఖం చూపించలేక వెనుకడుగు వేస్తున్నారని విమర్శించారు. కూటమి నాయకులకు ప్రజాక్షేత్రంలో తిరస్కారం తప్పదని, వైఎస్సార్‌సీపీ జెండా మైలవరం గడ్డపై మరోసారి ఎగరడం ఖాయమని పార్టీ శ్రేణులు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డా.మండూరు వెంకటరమణ కు జాతీయ సేవ రత్న పురస్కారం



**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఈనెల 6 తారీకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక భాషా సాంస్కృతి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాల్లో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సి ఎస్ ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మండూరు వెంకటరమణ కు జాతీయ సేవా రత్న పురస్కారం అందించామని కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ చైర్మన్ తెలియజేసారు. రమణ గత కొన్ని సంవత్సరాలుగా విద్యారంగంలో మరియు సామాజిక సేవ రంగంలో చేసిన కృషికి గుర్తింపు గాను ఈ అవార్డును దేవాదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్ చేతుల మీదుగా గుంటూరు విజ్ఞాన మందిరంలో అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ సలహాదారులు చుండూరు సీతారామాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ, ఉన్నత విద్యలో ఆరు పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీలు, మూడుపోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమాల తో పాటు న్యాయశాస్త్రంలో డాక్టరేట్ పొందటం ఎంతో అభినందనీయమన్నారు. ఈసందర్భాన్ని పురస్కరించుకొని అవార్డు పొందిన సిఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మండూరు వెంకటరమణను బుధవారం వి సి కార్యాలయంలో ఆచార్య కంచర్ల గంగాధర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ అవార్డు పొందటం సిఎస్ఆర్ కు మరియు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గర్వ కారణం అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా విశ్వవిద్యాలయం ప్రతిష్టను పెంపొందించేలా కార్యక్రమాలను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య ఎం.త్రిమూర్తి రావు, ఆచార్య ఎస్ మురళిమోహన్, ఆచార్య పి సుధాకర్ మరియు నూట అధ్యక్షులు ఆచార్య పి బ్రహ్మాజీ, సి ఎస్ ఆర్ డైరెక్టర్ ఆచార్య బి. బబిత తదితరులు డాక్టర్ వెంకటరమణ ను అభినందించారు.

## బీసీలకు స్థానిక సంస్థల్లో అధిక ప్రాధాన్యం కల్పించాలి

### ఏపీసీసీ ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ




**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రంలో బీసీల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఏపీసీసీ ఉపాధ్యక్షులు, పార్టీ రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కొలనుకొండ శివాజీ తీవ్రంగా విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని, బీసీల సంక్షేమం, ప్రాతినిధ్యంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో పోలీసుల కస్టడీలో మృతి చెందిన గోపి కుటుం బానికి తక్షణమే న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి, హోంమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. పోలీసులను చూసి ప్రజలు ధైర్యంగా ఉండాలో, భయపడాలో తెలియని పరిస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమ స్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని శివాజీ కోరారు. కరువు పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలను తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంతో పాటు ఇప్పటికే నిర్వహించిన పోటీ పరీక్షల ఫలితాలను వెంటనే వెల్లడించాలని కోరారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని శివాజీ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకను అణచివేయడం సరికాదని అన్నారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు యన్నం సుధీర్ బాబు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, బ్రహ్మం, వెంకట్ రెడ్డి, సమీర్, మెరిన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## బాపట్లలో 'నిజం గెలిచింది' కార్యక్రమం నిర్వహించిన గోనుగుంట్ల కోటేశ్వరరావు



**బాపట్ల, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** బాపట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా బాపట్లలో 'నిజం గెలిచింది' కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్, బాపట్ల నియోజకవర్గం టిడిపి పరిశీలకులు గోను గుంట్ల కోటేశ్వరరావు పాల్గొని 53 కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఆనాటి అక్రమ అరెస్టును ఖండించారని, కార్యకర్తల పోరాటంతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. వైకాపా ప్రభుత్వం కక్ష సాధింపుతోనే చంద్రబాబును 53 రోజులు అన్యాయంగా జైల్లో ఉంచిందని, అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ రాబోయే 15 ఏళ్ల కూటమి పాలనలో రాష్ట్రం గొప్పగా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఆదివాసీలపై వరుస దాడులు ఆందోళనకరం



### రిటైర్డ్ డీఎస్పీ దేవరకొండ ప్రసాద్

**మంగళగిరి, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రంలో ఆదివాసీలు, గిరిజనులపై వరుసగా జరుగుతున్న దాడులు, అక్రమాలు ఆందోళనకరంగా మారాయని రిటైర్డ్ డీఎస్పీ దేవరకొండ ప్రసాద్ అన్నారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చీరాల, చెరుకుపల్లి ఘటనలు గిరిజనుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వృద్ధ గిరిజన మహిళలపై దారుణంగా వ్యవహరించిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనుల పట్ల పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. పేదలు, గిరిజనులు, బీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, గిరిజనులపై దాడులకు అడ్డుకట్ట వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు. ప్రముఖ న్యాయవాది ఆర్కే దేవరకొండ మాట్లాడుతూ గిరిజన వృద్ధురాలు జమలమ్మ పట్ల పోలీసులు అనుచితంగా, దురుసుగా ప్రవర్తించారంటూ ప్రముఖ న్యాయవాది దేవరకొండ ఆర్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సోదాల పేరుతో వృద్ధురాలి ఇంటి తలుపులు బూటుకాలితో తన్నడం సమంజసం కాదన్నారు. మహిళల పట్ల సోదాల సమయంలో చట్టపరమైన నిబంధనలు, మర్యాద పాటించాలని సూచించారు. ఘటనపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అందుబాటులో ఉన్న ఆధారాలను సేకరించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ముఖ్యమంత్రి, హోంమంత్రి జోక్యం చేసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ వైసిపి ఎస్టి సెల్ అధ్యక్షుడు మేడా చైతన్య, మంగళగిరి మండల వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడి దుర్గ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఉయ్యాల చిన్న తదితరులు పాల్గొన్నారు.

## సూరమ్మ సేవలు చిరస్మరణీయం : బొండా ఉమ







### ఆమె జ్ఞాపకార్థం ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడే బస్ షెల్టర్ ఏర్పాటు

**విజయవాడ, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్ కండ్రికలో దివంగత సూరవరపు నాగేశ్వరరావు, సూరవరపు అనసూర్యవతి (సూరమ్మ) గార్ల జ్ఞాపకార్థం బుధవారం ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరవరపు నాగరాజు, పరుచూరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, సూరమ్మ తెలుగుదేశం పార్టీ కోసం, ప్రజల కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ఇంటింటికీ తిరిగి పార్టీ బలోపేతానికి ఆమె చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని తెలిపారు. డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ సూరమ్మ అందించిన సేవలు ఎంతో గొప్పవని బొండా ఉమా అన్నారు. ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె పేరుతో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆమె సేవలను స్మరించుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. సూరమ్మ జ్ఞాపకార్థం భవిష్యత్తులో కూడా పలు సేవా కార్యక్రమాలు చేపట్టి, ఆమె ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కోసం, ప్రజల కోసం సూరమ్మ చేసిన సేవలు చిరస్మరణీయమని, సూరమ్మ కి జోహార్! అంటూ బొండా ఉమామహేశ్వరరావు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, విఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల.బాలస్వామి,ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, డివిజన్ అధ్యక్షులు కాకొల్లు రవికుమార్, పలగాని భాగ్యలక్ష్మి, దాలిపర్తి ప్రసాద్, సుబ్బారావు, వడ్లాది శివరామకృష్ణ, గుండ్ల పాక శ్రీకాంత్, రాజేష్,రాజాలింగం, పైడేశ్వరరావు తదితరులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బాపట్లలో 'నిజం గెలిచింది' పేరిట కొవ్వొత్తుల ప్రదర్శన




**బాపట్ల, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాజకీయ కక్షసాధింపులో భాగంగానే గతంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా అరెస్ట్ చేశారని బాపట్ల నియోజకవర్గ టీడీపీ శ్రేణులు మండిపడ్డాయి. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ, న్యాయమే చివరకు గెలిచిందనే సందేశంతో స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆదేశాల మేరకు బాపట్ల నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో శాంతియుత ప్రదర్శన చేపట్టారు. "నిజం గెలిచింది" అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అర్ధరాత్రి వేళ అన్యాయంగా అరెస్ట్ చేసి 53 రోజుల పాటు చంద్రబాబును జైలులో నిర్బంధించిన ఆ చీకటి రోజును ఎన్నటికీ మరువలేమని, ప్రజాబలం ముందు కుట్రలు వీగిపోయాయని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, బాపట్ల మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జ్‌లు, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్వచ్ఛ వాయు సర్వేక్షన్ అవార్డు నగర ప్రజలకు గర్వకారణం



### నగరపాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్ ను సన్మానించ్చిన జనసేన నేతలు

**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కేంద్ర పర్యావరణ, అటవీశాఖ విడుదల చేసిన స్వచ్ఛ వాయు సర్వేక్షన్ 2026 లో గుంటూరుకు రెండో స్థానం రావటం గుంటూరు నగర ప్రజలకు గర్వకారణమని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఉత్తరప్రదేశ్ లోని హరిత భవన్ లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో అధి కారుల చేతుల మీదుగా అవార్డు తీసుకున్న గుంటూరు నగరపాలక సంస్థ కమీషనర్ మయూర్ అశోక్ ని బుధవారం అయన ఛాంబర్ లో జనసేన నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ గుంటూరు ప్రజలకు దేశ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చిన ప్రభుత్వానికి అధికారులకు, సహకరించిన ప్రజలకు అభినందనలు తెలిపారు. వాతావరణంలో వస్తున్న విపరీత మార్పుల నుంచి రక్షణ పొందాలంటే పర్యావరణ పరిరక్షణను ఒక ఉద్యమంలా చేపట్టాల న్నారు. పచ్చని చెట్లను విరివిగా నాటడమే కాకుండా వాటిని సంరక్షణను కూడా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వాయు కాలు ష్యాన్ని నియంత్రణను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. సిగ్నల్స్ దగ్గర వాహ నాలు ఆపినప్పుడు ఇంజన్ ఆపుచే యాలని దీనిద్వారా ఇంధనం ఆదా కావటమే కాకుండా కాలుష్య ఉద్గలను తగ్గించవచ్చన్నారు. స్వచ్ఛమైన గాలితోనే మనిషి ఆరోగ్యం ముడిపడి ఉందని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి మెహబుబ్ భాష తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ వైద్యానికి ఉజ్వల భవిష్యత్తు



### గుంటూరు ప్రభుత్వ వైద్యశాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వి సుందర చారి

**గుంటూరు, 09 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సాధారణ వైద్యుని చికిత్స అనంతరం రోగుల పూర్తిస్థాయి స్వస్థతలో ఫిజియోథెరపీ వైద్యం కీలక పాత్ర పోషిస్తుందని ఫిజియోథెరపీ వైద్యులు వృత్తిపట్ల అంకిత భావంతో సేవలందిస్తూ రోగుల అభిమానాన్ని పొందాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి సుందరా చారి పేర్కొన్నారు. ఏపీ ఫిజియోస్ స్పోర్ట్స్ క్లబ్ అమరావతి ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డు తన్విక ఫంక్షన్ హాల్ నందు ఫిజియోథెరపీ వైద్యులకు "బేసిక్ లైఫ్ సైన్సెస్ ఫిజికల్- యాక్టివిటీ కార్డియో వేస్కులర్ హెల్త్" పై ఒక రోజు కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందర చారి మాట్లాడుతూ ఇంతకుముందు కంటే ఫిజియోథెరపీ శాస్త్రీయంగా చాలా అభివృద్ధి చెంది అనేక అధునాతన పరికరాలు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయని వాటిని పూర్తిస్థాయిలో వైద్యులు వినియోగించుకుంటూ రోగులను పూర్తి స్వస్థత చేకూరేలా చూడాలని చెప్పారు. ఆంకాలజీ న్యూరాలజీ ఆర్థోపెడిక్ పీడియాట్రిక్స్ కార్డియో పలమనరీ వంటి అన్ని రకాల చికిత్సలో ఫిజి యోథెరపీ ముఖ్య భూమిక పోషిస్తుం దన్నారు.

**ఆంధ్ర ఫిజియో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బి నాగ సతీష్ కుమార్ మాట్లాడుతూ** అంతర్జాతీయ స్థాయి ఫ్యాకల్టీ ఫిజియోథెరపిస్టులతో ఆన్లైన్ శిక్షణ తరగతులు అందిస్తున్నామన్నారు నిరంతరం వైద్యసేవలతో ఉండే ఫిజియో తెరపిస్టులు శారీరక మానసిక వికాసానికి ప్రతి సంవత్సరం ఏపీ ఫిజియో క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ క్యారమ్స్ చెస్ వంటి క్రీడలు నిర్వహిస్తూ వారిలో నూతనొత్తేజాన్ని కలగ చేస్తున్నామని చెప్పారు. డాక్టర్ సుందరా చారిని ఫిజియోథెరపిస్టులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫిజియోస్ స్పోర్ట్స్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొహమ్మద్ ఇమ్రాన్, సహాయ కార్యదర్శి డాక్టర్ ఎన్ బి బాజీ, కోశాధికారి డాక్టర్ ఎంఎ షహీన్ బేగం, స్పోర్ట్స్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి సందీప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి విద్యాసాగర్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ డాక్టర్ వంగర కిరణ్, మార్కెటింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్ ప్రభాకర్, ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ టి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో ఏలేటి వ్యాఖ్యలపై దుమారం



**ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారపక్షం**

**సజావుగా సాగడం ఇష్టంలేదని వ్యాఖ్యలు**

**శాసనసభ నుంచి వాకౌట్ చేసిన బీజేపీ**

**స్పష్టమైన అజెండా తర్వాతే సభకు..**

**బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**హైదారాబాద్, సెప్టెంబర్ 09 :** బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటీ మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో అసెంబ్లీలో దుమారం రేగింది. సభలోలేని సభ్యులను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. సభ ఉల్లంఘన జరిగినప్పుడు బీజేపీ శాసనసభపక్ష నేతగా కొన్ని అంశాలను ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అసెంబ్లీలో పేర్కొన్నారు. ఏ నియమ నిబందనల ప్రకారంగా సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. కొత్తగా ఏమైనా పుస్తకం తయారు చేసుకున్నారా ప్రశ్నించారు. గ్రామాల్లో ఏడు గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. బీఏసీలో చెప్పినట్లు సభ నడుపుతారా లేదా రాష్ట్రంలో అనేక సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 22ఏ పై ఎప్పుడూ చర్చిస్తారో చెప్పే వరకు సభలో మా ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పార్టీ సభ్యులు మండిపడ్డారు. భలో లేనివారిని సస్పెండ్ చేయడం దారుణం. ఇష్టానుసారం సస్పెండ్ చేయడం బాధాకరం. రైతు సమస్యలపై చర్చ ఉంటుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది. బీఏసీలో చెప్పిన ప్రకారం సభ నడుపుతారా అని అన్నారు. సభ ఔన్నత్యాన్ని కాపాడటం మనందరి బాధ్యతన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభ స్థానంలో ఉన్న వారి గౌరవాన్ని కాపాడేలా మాట్లాడాలని హితువు పలికారు. ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న మంత్రి శ్రీధర్‌బాబు సభ కార్యక్రమాలను నిరంతరం అడ్డుకోవడం సమంజసమా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. సభ సజావుగా సాగడం బీజేపీ సభ్యులకు ఇష్టం లేనట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని రోజులైనా సభ నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దళిత వర్గాలు, బలహీనవర్గాల హక్కులను కాపాడాలని సూచించారు. సామాజిక న్యాయం చేయాలని లేకపోతే ఏమనాలని ప్రశ్నించారు. విద్యాశాఖలో తెచ్చిన సంస్కరణలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, 22ఏ సమస్యపైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నామని వెల్లడించారు. బీజేపీ సభ్యుల వైఖరి మార్చుకుంటేనే మరింత ఎదుగుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. దళితులను అవమానించినవారిని సమర్థించడం మంచి పద్ధతి కాదని సూచించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడితే వారిని మెచ్చుకోవచ్చని పేర్కొన్నారు.సభ సజావుగా జరగడం బీజేపీ సభ్యులకు ఇష్టంలేదన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సభ్యసమాజం తలదించుకునేలా స్పీకర్‌పై ఇష్టానుసారం మాట్లాడతారా అని నిలదీశారు. నిరసన కార్యక్రమం చేస్తుంటే శుద్ధి చేయడం మంచి పద్ధతా? అని ప్రశ్నించారు. ఎర్రవల్లిలో దళితులు కార్యక్రమం చేసిన చోట శుద్ధి చేయడాన్ని ఏమనాలని?, ఖర్గే కూర్చున్న వేదికను ఎందుకు శుద్ధి చేశారో సమాధానం చెప్పాలని బీజేపీ సభ్యులను డిమాండ్ చేశారు. శాసనసభ నుంచి బీజేపీ వాకౌట్ చేసింది. ప్రభుత్వం అజెండా అంశాలను ముందే ఇవ్వట్లేదని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపింటారు. స్పష్టమైన అజెండా ఇచ్చిన తర్వాతే సభ వస్తామని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

**ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..**

**తెలంగాణలో అధికారంలోకి వస్తాం.. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**



**హైదారాబాద్, సెప్టెంబర్ 09 :** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## తాతా మధు, నవీన్‌రెడ్డిపై మండలి ఎథిక్స్ కమిటీ విచారణ షురూ

**అసెంబ్లీ తీర్మానం, సభ్యుల ఫిర్యాదులు పరిశీలించిన కమిటీ**

**సమగ్ర నివేదిక ఇవ్వండి.. అధికారులకు కమిటీ చైర్మన్**

**మహేశ్‌కుమార్ గౌడ్ సూచన**

**హైదరాబాద్, సెప్టెంబరు 9 :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై చర్యలకు సంబంధించి శాసనమండలి ఎథిక్స్ కమిటీ విచారణను ప్రారంభించింది. చైర్మన్ మహేశ్ గౌడ్ అధ్యక్షతన మండలి కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నాడు కమిటీ సమావేశమైంది. ఈ భేటీలో కమిటీ సభ్యులు దేశపతి శ్రీనివాస్ (బీఆర్ఎస్), నెల్లికంటి సత్యం (సీపీఐ), శాసనమండలి కార్యదర్శి నర్సింహాచారి, డిప్యూటీ కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. మరో ఇద్దరు సభ్యులు కూచికుళ్ల దామోదర్ రెడ్డి, సీహెచ్ అంజిరెడ్డి హాజరు కాలేకపోయారు. తాతా మధు, నవీన్ రెడ్డిలపై చర్యలకు సంబంధించి శాసనసభ మంగళవారం ఆమోదించిన తీర్మానాన్ని, వారిద్దరిపై కాంగ్రెస్ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులు, ఆధారాలను కమిటీ పరిశీలించింది. అయితే ఈ సమావేశంలో దేశపతి శ్రీనివాస్ తన అభ్యంతరాలను తెలిపారు. తాతా మధు వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా వచ్చినవి కావంటూ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. మరో సభ్యుడు నెల్లికంటి సత్యం మాత్రం దళితవర్గానికి చెందిన స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు.. సీరియస్‌గా తీసుకోవాల్సిన అంశమేనన్నారు. మహిళా సభ్యులపై పోలీసులు వ్యవహరించిన తీరుపైనా విచారణ జరగాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో తాతా మధు, నవీన్ రెడ్డిలపై ఫిర్యాదు చేస్తూ ఇచ్చిన ఆధారాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి వచ్చే సమావేశం నాటికి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు మహేశ్‌గౌడ్ సూచించారు.

# కాంగ్రెస్ కుటిల రాజకీయం

**ఎమ్మెల్సీ అనని మాటలు అన్నట్టుగా చిత్రీకరణ**

**కేసీఆర్‌ను హత్యచేసేందుకు రేవంత్ సర్కార్ కుట్ర**

**అసెంబ్లీ వ్యవహారాలు, ఘటనలపై గవర్నర్‌కు చెప్పాం**

**ప్రతి అంశంపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు**

**న్యాయం జరుగకుంటే జాతీయ సంస్థలను ఆశ్రయిస్తం**

**గవర్నర్ శుక్లాను కలిసిన అనంతరం మీడియాతో**

**బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**హైదరాబాద్, సెప్టెంబర్ 9 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలు, శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల చర్యలు, కేసీఆర్ నివాసంపై దాడి వంటి అంశాలను గవర్నర్ శివప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లినట్టు బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు వెల్లడించారు. శాసనసభా వ్యవహారాలతోపాటు బయట జరిగిన ఘటనలపైనా విచారణ జరిపిస్తామని గవర్నర్ తమకు హామీ ఇచ్చారని, రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యకాండలో ఆయన జోక్యం చేసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో న్యాయం జరుగకపోతే జాతీయ స్థాయి సంస్థలను ఆశ్రయిస్తామని తేల్చి చెప్పారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో బుధవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను పార్టీ ప్రతినిధులతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ వ్యవహారాలతోపాటు సభ వెలుపల జరిగిన ప్రతి ఘటనను, కేసీఆర్ ఇంటిపై దాడి వంటి అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. అనంతరం లోక్‌భవన్ బయట మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాము గవర్నర్‌ను కలిశామని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను గవర్నర్‌కు వివరించామని, ప్రతి అంశంపైనా విచారణ జరిపిస్తామని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు.

### 1,000 రోజుల పాలన విఫలం

'కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామని అధికారంలోకి వచ్చింది. 1,000 రోజులైనా వాటిని అమలుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీనిపై గవర్నర్‌కు సమగ్రంగా వివరించాం' అని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదురొంటున్న సమస్యలను వివరించామని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై తమ వాదనను ఆయన ముందుంచామని చెప్పారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన, వారి డిమాండ్లను వివరిస్తూ, వారి ఆందోళనను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతోపాటు, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు.

### పోలీసుల అడ్డంకులపై ఫిర్యాదు

శాసనసభ సమావేశాల తొలిరోజు జరిగిన పరిణామాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు కేటీఆర్ వివరించారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులో నిరసన తెలిపిన తరహాలోనే తాము కూడా టీషర్టులు ధరించి నిరసన వ్యక్తంచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. శాసనసభ్యులుగా తమకున్న హకులను కాలరాస్తూ, సభలోకి వెళ్లనీయకుండా పోలీసులు రోడ్డుపైనే అడ్డుకున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పోలీసులు తమపై దాష్టీకానికి పాల్పడ్డారని గవర్నర్‌కు వివరించినట్టు చెప్పారు. తమపై జరిగిన దాడికి సంబంధించిన ఫొటోలు, ఇతర ఆధారాలను గవర్నర్‌కు అందజేశామని తెలిపారు. మహిళా శాసనసభ్యులపై జరిగిన పోలీసుల దుశ్చర్యను ప్రత్యేకంగా వివరించినట్టు చెప్పారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగారని, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. తమపై దాడి చేసిన తర్వాత తిరిగి తమపైనే నిందలు మోపే ప్రయత్నం జరుగుతున్నదని వివరించినట్టు చెప్పారు. పోలీసుల చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆధారాలను గవర్నర్ ముందుంచామని తెలిపారు. హైకోర్టు సూచనలు ఉన్నప్పటికీ తమను సభల్లోకి రానివ్వకుండా ప్రభుత్వం వ్యవహరించిందని చెప్పారు. ఈ పరిణామాల ద్వారా ప్రభుత్వానికి రాజ్యాంగం, న్యాయస్థానాలపై గౌరవం లేదనే విషయం స్పష్టమవుతున్నదని వివరించినట్టు తెలిపారు.

### స్పీకర్ పేరిట రాజకీయం?

బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన అంశాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని కేటీఆర్ చెప్పారు. శాసనమండలి సభ్యులు అనని మాటలను అన్నట్టుగా ఆపాదిస్తూ, జరుగని అవమానాన్ని జరిగినట్టుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్‌పై తమకు అపారమైన గౌరవం ఉన్నదని స్పష్టం చేస్తూనే, కాంగ్రెస్ పార్టీయే పదేపదే 'దళిత స్పీకర్' అంటూ ఆయనను రాజకీయ వివాదంలోకి లాగుతున్నదని విమర్శించారు. కేసీఆర్ ఇంటిపై దాడి చేస్తూ హత్యాయత్నానికి ప్రభుత్వం ప్రయత్నించిన తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ముఖ్యమంత్రి స్వయంగా ఉన్నారని ఆరోపించారు. కేసీఆర్ లాంటి మహానాయకుడి ఇంటి వద్ద చావు డప్పు కొట్టి ఆయన చావును కోరడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు.

### అన్ని అంశాలపైనా విచారణకు గవర్నర్ హామీ

తాము వివరించిన అన్ని అంశాలపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని కేటీఆర్ తెలిపారు. శాసనసభ వ్యవహారాలతోపాటు సభ వెలుపల జరిగిన ప్రతి ఘటనపైనా విచారణ జరిపిస్తామని గవర్నర్ శివప్రతాప్ శుక్లా తమకు హామీ ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యకాండలో గవర్నర్ జోక్యం చేసుకుంటారని ఆశిస్తున్నామని తెలిపారు. తమపై జరిగిన ఘటనలపై ప్రభుత్వం విడుదల చేసిన ఏఐ ఫొటోలు, వీడియోలపై ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు. తప్పుడు చిత్రాలు, తప్పుడు ఫిర్యాదులను ఉపయోగించి తమపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే గవర్నర్ దృష్టికి ఆ అంశాలనూ తీసుకెళ్లామని చెప్పారు. ఈ విషయంలో తగిన స్పందన రాకపోతే తదుపరి దశలో జాతీయ స్థాయి సంస్థలను ఆశ్రయిస్తామని కేటీఆర్ చెప్పారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడుల అంశంపై జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దేశపతి శ్రీనివాస్, దాసోజు శ్రవణ్, వాణీదేవి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాణిక్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, కేపీ వివేకానందగౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# తక్షణమే పీఆర్సీ నివేదిక

**సీపీఎస్‌పై నిపుణుల కమిటీ ఏర్పాటుకు నిర్ణయం**

**ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై సర్కారు సానుకూలత**

**సీఎస్ ఆధ్వర్యంలో సంఘాల నేతలతో కీలక సమావేశం**

**త్వరగా నివేదికను సమర్పించాలంటూ పీఆర్సీకి సీఎస్ ఆదేశాలు**

**పెండింగ్ కరువు భత్యాలపై 18న మరోసారి భేటీ**

**నేటి 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసిన జేఏసీ**

**హైదరాబాద్, సెప్టెంబరు 9 :** ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను తక్షణమే తెప్పించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రిపోర్టును త్వరగా అందజేయాలంటూ పీఆర్సీని ఆదేశించింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)పై అధ్యయానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. పెండింగ్ కరువు భత్యాల(డీఏ)పై ఈ నెల 18న మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేసింది. దీంతో ఈ నెల 10న నిర్వహించతలపెట్టిన 'చలో హైదరాబాద్' నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నామని మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలోని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈజేఏసీ) ప్రకటించింది. ఈ జేఏసీ నేతలతో పాటు లచ్చిరెడ్డి చైర్మన్‌గా గల తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈజేఏసీ) నాయకులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సాధారణ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్హర్ మహేశ్ దత్ ఎక్కా పాల్గొన్నారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న 6 కరువు భత్యాల(డీఏ) విడుదల, ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిల విడుదల, సీపీఎస్ ఉపసంహరణ, నూతన వైద్య బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయడం, ఇతర పెండింగ్ సమస్యలపై సమావేశంలో చర్చ జరిగింది. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధాన పునరుద్ధరణపై అధ్యయనానికి ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. పీఆర్సీ సభ్యులు, అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పింది.. తర్వాత 3 నెలల్లో దీనిపై నివేదిక ఇచ్చేలా చర్చ జరిగింది. ఒకవేళ 18న డీఏలపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రానట్లయితే, 19న జేఏసీ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని తదుపరి కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని టీజీఈజేఏసీ ప్రతినిధులు హెచ్చరించారు. గురువారం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

### సభ తర్వాతే సానుకూలత: లచ్చిరెడ్డి

ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీజీఈజేఏసీ)తో రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్చలు జరిపిందని చైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వడ్నాల రాజశేఖర్ తెలిపారు. 6న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉద్యోగుల సంకల్ప సభ' అనంతరం ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, చర్చలకు ఆహ్వానించిందన్నారు.




### సీపీఎస్ రద్దు చేయాలి: సీపీఎస్ఈయూ

సీపీఎస్‌పై నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడానికి ఆహ్వానిస్తున్నామని 'తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేశ్ గౌడ్ పేర్కొన్నారు. నవంబరు 17 నాటికి సీపీఎస్ రద్దుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

### వాయిదా ఊహించిందే: జేఎస్‌సీ

ఉద్యోగుల సమస్యల సాధనకు ఉద్యోగుల జేఏసీలు ఇచ్చిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవడం తాము ఊహించిందేనని 'జాయింట్ స్ట్రగుల్ కమిటీ ఆఫ్ ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్, ఔట్‌సర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్' రాష్ట్ర చైర్మన్ టి.ప్రభాకర్, సమన్వయకర్త సయ్యద్ షౌకత్ అలీ తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రస్తుతమున్న రెండు జేఏసీలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

**దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్**

**ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్**

**నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు**

**దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు**

**7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం**

**తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం**

**4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు**

**పెరగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం**

**రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు**

**మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్**




**న్యూఢిల్లీ:** రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి టెస్టింగ్? కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్? పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్- కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలం-కరూర్-దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యటక ప్రదేశాలకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(ఝార్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ- రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్? మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులు ప్రణాళిక రచించారు. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు నిరంతరాయ అనుసంధానాన్ని అందిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. రైల్వే నెట్‌వర్క్ పెరగడం వల్ల దేశంలో చమురు దిగుమతులు తగ్గుతాయని అభిప్రాయపడింది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా అవుతుందని తెలిపింది. అలాగే, 62 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని పేర్కొంది.

# 'కాగ్నిజెంట్'కు భారీ ఎదురుదెబ్బ

**శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ నిలిపివేత**

**అమెరికా ఉద్యోగుల భద్రతకై నిర్ణయం**

**రెండు సంస్థలపై దర్యాప్తు ముమ్మరం**

**న్యూఢిల్లీ:** మోసాలపై ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్న వేళ ప్రముఖ ఐటీ సంస్థ 'కాగ్నిజెంట్'కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. గ్రీన్ కార్డు పొందడానికి తొలి మెట్టుగా భావించే శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ (పీఈఆర్‌ఎం) ఫైలింగ్స్‌ను అమెరికా ప్రభుత్వం నిలిపివేసింది. కాగ్నిజెంట్‌తో పాటు, క్లౌడెరా సంస్థల శాశ్వత లేబర్ సర్టిఫికేషన్ ప్రక్రియను సస్పెండ్ చేసినట్లు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో ప్రకటించారు. అమెరికా ఉద్యోగులకు ముప్పు వాటిల్లితే సహించేది లేదని పేర్కొన్నారు. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్ ఫోర్స్, ఇతర ఉన్నతాధికారుల సమన్వయంతోనే ఈ రెండు సంస్థలపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. మరోవైపు ఈ వ్యవహారంపై అమెరికా కార్మిక శాఖ దర్యాప్తును వేగవంతం చేసింది. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్‌తో కలిసి వాస్తవాలు, మోసం, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలను లోతుగా పరిశీలిస్తున్నామని ఆంథోనీ డి'ఎస్పోసిటో తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "కాగ్నిజెంట్ పెర్మ్ ఫైలింగ్‌లను నిలిపివేశాం. వైట్‌హౌస్ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్‌తో కలిసి వాస్తవాలు, మోసం, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నాం. నేరస్థులకు సంకెళ్లు సిద్ధంగా ఉన్నాయ" అని డి'ఎస్పోసిటో పేర్కొన్నారు. కాగ్నిజెంట్, క్లౌడెరా సంస్థల పెర్మ్ ప్రక్రియను ఎందుకు నిలిపివేశారనే దానిపై దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కార్మిక శాఖ అధికారులు సంబంధిత రికార్డులు, ఫైలింగ్స్, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికాలో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాసం అంటే గ్రీన్‌కార్డు కోసం యాజమాన్యాలు అనుసరించే ముఖ్యమైన ప్రక్రియే ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్. విదేశీ ఉద్యోగిని శాశ్వతంగా నియమించుకునే ముందు ఆ ఉద్యోగానికి అర్హత కలిగిన అమెరికా కార్మికులు అందుబాటులో లేరని యాజమాన్యం నిరూపించాల్సి ఉంటుంది. అంతేకాకుండా విదేశీ ఉద్యోగిని నియమించడం వల్ల అమెరికా కార్మికుల వేతనాలు, ఉద్యోగ అవకాశాలు, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం ఉండదని కూడా నిర్ధరించాలి. ఈ ప్రక్రియను అమెరికా కార్మిక శాఖ పరిశీలించి అనుమతి ఇస్తుంది. ఆ తర్వాతే గ్రీన్‌కార్డు కోసం ఉద్యోగి తరఫున తదుపరి ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారత్‌కు చెందిన అనేక మంది ఐటీ నిపుణులు అమెరికాలోని టెక్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. వీరిలో కొందరు దీర్ఘకాలికంగా అమెరికాలో ఉండేందుకు గ్రీన్‌కార్డు కోసం ప్రయత్నిస్తుంటారు. ఇందుకోసం కంపెనీలు ఉద్యోగుల తరఫున ప్రక్రియను చేపడతాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాగ్నిజెంట్ ఫైలింగ్స్ నిలిపివేయడం సంస్థలోని విదేశీ ఉద్యోగులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే గ్రీన్‌కార్డు ప్రక్రియలో ఉన్న ఉద్యోగులకు ఈ పరిణామం ఆందోళన కలిగించవచ్చు. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు సంస్థకు సంబంధించిన అన్ని కేసులపై తుది ప్రభావం ఎలా ఉంటుందనే విషయం స్పష్టంగా తెలియాల్సి ఉంది. ట్రంప్ ప్రభుత్వం వీసా కార్యక్రమాల్లో అక్రమాలు, మోసాలపై మరింత కఠిన వైఖరి అవలంబిస్తోంది. జులైలోనే ఉపాధి వీసా కార్యక్రమాలకు సంబంధించిన మోసం ఆరోపణలపై పెద్ద స్థాయి దర్యాప్తును ప్రారంభించినట్లు సమాచారం. అమెరికా ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ యంత్రాంగం స్పష్టం చేస్తోంది. విదేశీ ఉద్యోగులను నియమించుకునే సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కాగ్నిజెంట్, క్లౌడెరాపై తాజా చర్య ప్రాధాన్యం సంతరించుకుంది.

# తిరుమల భక్తులకు బీమా

**పాలకమండలి సమావేశంలో చైర్మన్ బీఆర్ నాయుడు**

**తిరుమల:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోందని టీటీడీ చైర్మన్ బిఆర్. నాయుడు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో బుధవారం చైర్మన్ అధ్యక్షతన టీటీడీ పాలకమండలి సమావేశం జరిగింది. అనంతరం సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రతో కలసి చైర్మన్ మీడి యా కు వెల్లడించారు. ఇందులోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే అక్టోబర్ 12 నుంచి 20 వ తేది వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈనెల 14 వ తేది సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారం భమవుతాయి. సెప్టెంబర్ 15 న రాష్ట్రం ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పణ. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కాగా అదేరోజు రాత్రి 9 గంటలకు శ్రీస్వామివారి పెద్దశేష వాహన సేవలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. రిలయన్స్ సంస్థ టీటీడీకి విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను సెప్టెంబర్ 16 న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. అదే కార్యక్రమంలో 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ క్యాలెండర్లు, డైరీలను సీఎం ఆవిష్కరిస్తారు. అలాగే భక్తుల అవస రాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ 10 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలి పారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలతో పాటు సింగపూర్, జర్మనీ దేశాల నుంచి కళాకారులు పాల్గొనున్నారు. భక్తుల భద్రతకు 3,000 మంది పోలీసులతో పాటు 2,500 మంది టీటీడీ నిఘా, భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. తిరుమలలో పారిశుద్ధ్య



నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు 3,000 నుంచి 3,300 మంది సిబ్బందిని నియమిస్తున్నా మన్నారు. ఈ ఏడాది గరుడ సేవకుగతేడాదితో పోలిస్తే 15 నుంచి 20 శాతం మంది భక్తులు అదనంగా వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అన్ని ఏర్పా ట్లు చేస్తున్నామని తెలిపారు. గరుడ సేవ రోజున గతే డాది 6.13 లక్షల మందికి అన్నప్రసాదం అందించగా, ఈసారి 9.30 లక్షల మందికి అన్నప్రసాదం అందిం చేలా ఏర్పాట్లు. ఇది గతేడాదితో పోలిస్తే 52 శాతం అదనం. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో అన్ని ఏర్పాట్లు, దర్శనం, వసతి, అన్నప్రసాదం, రవణా, భద్రత, వైద్య, పారిశుద్ధ్యం, విద్యుత్, పుష్పా లంకరణలు తదితర అన్ని విభాగాల్లో పనులు శర వేగంగా కొనసాగుతున్నాయి. శ్రీవారి బ్రహ్మోత్స వాలకు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ప్రతి భక్తునికి సౌకర్యవంతమైన దర్శనం, సురక్షితమైన వాతా వరణం. మెరుగైన వసతులు కల్పించడమే టీటీడీ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా టీటీడీ, పోలీసు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పటిష్టమైన, సమగ్ర ఏర్పాట్లు చేపట్టింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా విజయవంతంగా నిర్వహిం చేందుకు టీటీడీ సిద్ధంగా ఉందని తెలిపారు.

అదె 'విధంగా భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ తిరుమలలో ప్రమాద వశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అందించే భీమాను రూ. 3 నుంచి 10 లక్షలకు పెంచేందుకు నిర్ణయం. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు తిరుమలలో సహజమరణం సంభవించిన సందర్భంలో లైఫ్ ఇన్సూరెన్స్ పద కాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ఆలయాల పరిపా లనలో టీటీడీ ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా మర ణించిన భక్తుని కుటుంబానికి రూ.2 లక్షలు చెల్లిస్తారు. ఈ సమావేశంలో అదనపు ఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు, జీఈవోలు శరత్, ప్రభల గోపినాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు

# 13 రకాల విత్‌డ్రాలను 3 కేటగిరీలు

**పీఎఫ్ అడ్వాన్స్ రూల్స్‌లో కీలక మార్పులు**

**75 శాతం బ్యాలెన్స్ విత్‌డ్రాకు అనుమతి**

**న్యూఢిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ ఖాతా నుంచి నిధుల పాక్షిక ఉపసంహరణ (అడ్వాన్స్) నిబంధనలను సంస్థ గణనీయంగా సరళీకరించింది. గతంలో అమల్లో ఉన్న 13 రకాల సంక్లిష్ట ఉపసంహరణ పద్ధతులను రద్దు చేసి, వాటి స్థానంలో కేవలం మూడు సులభతర విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. నూతన నిబంధనల ప్రకారం, ఈపీఎఫ్‌లో సభ్యత్వం పొంది 12 నెలలు పూర్తి చేసుకున్న చందాదారులు తమ ఖాతాలోని నిల్వలో 75 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చు. అయితే, ఖాతాలో కనీసం 25 శాతం నిల్వను తప్పనిసరిగా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ గతంలోనే ఆమోదం తెలిపింది. తాజా సవరణల ప్రకారం, ఉపసంహరణ ప్రక్రియను మూడు ప్రధాన విభాగాలుగా వర్గీకరించారు. అనారోగ్యం లేదా వైద్య చికిత్స నిమిత్తం సర్వీసు కాలంలో ఎన్నిసార్లయినా నిధులు తీసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే, చదువుల కోసం 10 సార్లు, వివాహ అవసరాల కోసం 5 సార్లు ఉపసంహరణకు అనుమతి ఇచ్చారు. ఇల్లు లేదా ప్లాట్ కొనుగోలు, గృహ నిర్మాణం, గృహ రుణాల చెల్లింపు లేదా ఇంటి మరమ్మతుల కోసం సర్వీసు మొత్తంలో ఐదుసార్లు అడ్వాన్స్ పొందే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు, సంస్థ మూసివేత, ఉద్యోగం కోల్పోవడం లేదా మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు నిధులు ఉపసంహరించుకునే వెసులుబాటు కల్పించారు.

# విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

**సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది.. ఎన్‌సీఈఆర్‌టీపై సుప్రీం కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ:** విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది. అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చి ందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయ వాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

# కెనడా ఉత్పత్తులపై అమెరికా నిషేధం

**అమల్లోకి తెచ్చిన ప్రతీకార సుంకాలు**

**న్యూఢిల్లీ:** అమెరికా- కెనడా మధ్య వాణిజ్య వివాదం మరింత ముదిరింది. కెనడా విధించిన ప్రతీకార సుంకాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వాహనాలు, ఆటో విడిభాగాలు, మద్యం, పాల ఉత్పత్తులపై ఆంక్షలు విధిస్తూ ఏకంగా ఐదు ఉత్తర్వులు జారీ చేశారు. భారీ, దీర్ఘకాలిక అమెరికా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో కెనడియన్ ఉత్పత్తులపై నిషేధం వించాలని జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించారు. అమెరికా ఉత్పత్తులకు కెనడా పూర్తి న్యాయమైన పరస్పర ప్రయోజనం కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ వాహనాలు, ఆటోమొబైల్ విడిభాగాలను అమెరికాలోకి దిగుమతి చేయకుండా నిషేధించేలా ట్రంప్ తొలి ఉత్తర్వును జారీ చేశారు. కెనడాలోని కొన్ని ప్రావిన్సులు అమెరికా బీర్, వైన్, స్పిరిట్స్ పంపిణీ, రిటైల్ విక్రయాలు, కొనుగోళ్లపై ఆంక్షలు విధిస్తున్నాయని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా కొన్ని కెనడియన్ ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధించే పరిధిని మార్చుతూ ట్రంప్ రెండో ఉత్తర్వు జారీ చేశారు. ఎంపిక చేసిన కెనడియన్ డెయిరీ ఉత్పత్తులను అమెరికాలోకి దిగుమతి చేసుకోకుండా నేరుగా నిషేధిస్తూ మూడో ఉత్తర్వు జారీ చేశారు. అమెరికా మద్యం ఉత్పత్తులపై కెనడాలోని ప్రావిన్సులు విధిస్తున్న ఆంక్షలకు ప్రతిగా, ఎంపిక చేసిన కెనడియన్ మద్యం ఉత్పత్తుల దిగుమతులను నిషేధిస్తూ మరో ఉత్తర్వు తీసుకొచ్చారు. మోటార్ వాహనాల వివాదానికి సంబంధించిన అదనపు సుంకాల పరిధిని కూడా ఐదో ఉత్తర్వుతో మార్చారు. ఇదే సమయంలో అమెరికా ప్రభుత్వ ప్రధాన కొనుగోలు వ్యవస్థ నుంచి కెనడియన్ ఉత్పత్తులను తొలగించాలని ట్రంప్ ఆదేశించారు. జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్ (జీఎస్?ఏ), యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్?టీఆర్)లు ఈ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. కెనడా కూడా అమెరికా సంస్థలు, రైతులకు సమానమైన మార్కెట్ అవకాశాలు కల్పించే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. 'నో రెసిప్రాసిటీ, నో యాక్సెస్' అనే విధానాన్ని ప్రకటించారు. జీఎస్?ఏ నిర్వహించే మల్టిపుల్ అవార్డ్ షెడ్యూల్స్ నుంచి కెనడాలో తయారైన ఉత్పత్తులను తొలగించాలని సూచించారు. ఈ కొనుగోలు షెడ్యూళ్ల ద్వారా ఏటా 5,000 కోట్ల డాలర్లకుపైగా విలువైన ప్రభుత్వ కొనుగోళ్లు జరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు అమెరికా వస్తువులపై కెనడా విధించిన ప్రతీకార సుంకాలు మంగళవారం అర్ధరాత్రి 12:01 గంటలకు అమల్లోకి వచ్చాయి. దాదాపు 2,800 కోట్ల డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై కొత్త టారిఫ్‌లు విధించింది. దాదాపు 700 రకాల అమెరికా ఉత్పత్తులపై 15 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు అమలవుతున్నాయి. ఉక్కు, అల్యూమినియం వంటి పారిశ్రామిక ముడి పదార్థాలతో పాటు టాయిలెట్ పేపర్, ఆర్కేడ్ గేమ్ మెషీన్లు వంటి ఉత్పత్తులపైనా ఈ ప్రభావం పడనుంది.

# ఒకే రోజు రెండు దేశాల్లో టీమిండియా మ్యాచ్‌లు

## క్రికెట్ చరిత్రలో అరుదైన ఘట్టం!

భారత క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన, ఆసక్తికరమైన ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. అక్టోబర్ నెలలో ఏకంగా రెండు భారత జట్లు ఒకే రోజు వేర్వేరు దేశాల్లో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఏర్పడింది. జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో ఒక జట్టు ఫైనల్ ఆడుతుండగా, అదే రోజున మరో జట్టు స్వదేశంలో వెస్టిండీస్‌తో వన్డే మ్యాచ్‌లో తలపడనుంది. ఇది భారత క్రికెట్ రిజర్వ్ బెంచ్ బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అద్భుతమైన సందర్భం కానుంది.

వివరాల్లోకి వెళితే.. జపాన్‌లోని ఐచి-నగోయాలో 2026 ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఈ క్రీడల్లో భాగంగా జరిగే పురుషుల క్రికెట్ పోటీలు టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. బలమైన జట్టుగా గుర్తింపు పొందిన భారత్, నేరుగా సెప్టెంబర్ 28న జరిగే క్వార్టర్ ఫైనల్‌లో తన ప్రస్థానాన్ని ప్రారంభిస్తుంది. ఈ టోర్నీలో సెమీ ఫైనల్స్ అక్టోబర్ 1న, ఫైనల్ సహా పతకాల కోసం జరిగే మ్యాచ్‌లు అక్టోబర్ 3న జరగనున్నాయి. ఒకవేళ భారత జట్టు ఫైనల్‌కు అర్హత సాధిస్తే, అక్టోబర్ 3న జపాన్‌లో స్వర్ణ పతకం కోసం పోటీపడుతుంది.



సరిగ్గా అదే రోజు (అక్టోబర్ 3న) భారత్‌లో మరో అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో భాగంగా మూడో వన్డే మ్యాచ్ న్యూ చండీగఢ్‌లో షెడ్యూల్ అయింది. దీంతో ఒకేరోజు రెండు వేర్వేరు ఫార్మాట్లలో, రెండు వేర్వేరు దేశాల్లో భారత జాతీయ జట్లు బరిలోకి దిగనున్నాయి. ఈ అరుదైన దృశ్యం అభిమానులకు కనుల పండుగ చేయనుంది.

### ఆసియా క్రీడల కోసం వన్డే సిరీస్‌కు అయ్యర్ దూరం

ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత ౹20 జట్టుకు స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ నేపథ్యంలో అతను సెప్టెంబర్ 22 నాటికి జట్టుతో పాటు జపాన్ చేరుకోనున్నాడు. అదే రోజు జపాన్‌తో భారత జట్టు తలపడనుంది. అయితే, ఆసియా క్రీడల షెడ్యూల్ కారణంగా అయ్యర్.. వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే వన్డే సిరీస్‌కు పూర్తిగా దూరం కానున్నాడు. వాస్తవానికి అయ్యర్ భారత వన్డే జట్టుకు వైస్ కెప్టెన్‌గా కూడా ఉన్నాడు. 2025 అక్టోబర్‌లో అతడికి ఈ బాధ్యతలు అప్పగించారు. అయినప్పటికీ, దేశానికి ప్రాతినిధ్యం వహించే ఆసియా క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ వన్డే సిరీస్‌లో ఆడటం లేదు.

### జట్లు స్వర్ణాలు సాధిస్తాయి: బీసీసీఐ చీఫ్

ఈ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మనహాస్ మాట్లాడుతూ.. ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న భారత బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. "ఆసియా క్రీడలకు వెళ్తున్న మన బృందానికి, ముఖ్యంగా క్రికెట్ జట్లకు నా శుభాకాంక్షలు. వారు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఆశిస్తున్నాను. యావత్ దేశం వారికి అండగా ఉంది. వారు స్వర్ణ పతకాలు గెలిచి దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని కోరుకుంటున్నాను" అని ఏఎన్ఐతో అన్నారు.

"జట్ల కఠోర శ్రమ, సన్నద్ధత, ఉత్సాహం చూస్తుంటే వారు తప్పకుండా స్వర్ణం సాధించి దేశం గర్వపడేలా చేస్తారన్న పూర్తి విశ్వాసం నాకుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### ఆసియా క్రీడలకు భారత పురుషుల క్రికెట్ జట్టు:

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీ.

# ఇషాన్ కిషన్ మరోసారి విధ్వంసం

**ఈస్ట్ జోన్‌కు 584 పరుగుల భారీ ఆధిక్యం**

**దులీప్ ట్రోఫీ ఫైనల్‌పై పట్టు బిగించిన ఈస్ట్ జోన్**

**విధ్వంసక హాఫ్ సెంచరీతో అదరగొట్టిన ఇషాన్ కిషన్**

**ఒక్క పరుగు తేడాతో సెంచరీ కోల్పోయిన తిలక్ వర్మ**

**సౌత్ జోన్‌పై 584 పరుగుల భారీ ఆధిక్యంలో ఈస్ట్ జోన్**

**రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించి టైటిల్‌ను ఖాయం చేసుకున్న ఈస్ట్**



దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి తన పట్టును మరింత బిగించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా బుధవారం జరిగిన నాలుగో రోజు ఆటలో, కెప్టెన్ ఇషాన్ కిషన్ (80), శిఖర్ మోహన్ (52) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ ఏకంగా 584 పరుగుల భారీ ఆధిక్యం సాధించి, టైటిల్‌ను దాదాపు ఖాయం చేసుకుంది.

### ఇషాన్, మోహన్ అద్భుత భాగస్వామ్యం

తొలి ఇన్నింగ్స్‌లో 372 పరుగుల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ, ఈస్ట్ జోన్ ఫాలో ఆన్ విధించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే, ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (8), అభిమన్యు ఈశ్వరన్ (0) విఫలమవడంతో ఆరంభంలో తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శిఖర్ మోహన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 170 బంతుల్లో 126 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 98 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80 పరుగులు చేశాడు. విజయ్ వేసిన ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 20 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి కిషన్ ఔటవగా, నిలకడగా ఆడిన శిఖర్ మోహన్ (52) కూడా పెవిలియన్ చేరాడు.

### ఒక్క పరుగుతో శతకం చేజార్చుకున్న తిలక్ వర్మ

అంతకుముందు, ఉదయం సెషన్‌లో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. అయితే, దురదృష్టవశాత్తూ ఒక్క పరుగు తేడాతో తన తొమ్మిదో ఫస్ట్‌క్లాస్ సెంచరీని చేజార్చుకున్నాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో సీవీ మిలింద్ (43) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత సౌత్ జోన్ ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. ముఖేష్ కుమార్ 3 వికెట్లతో రాణించాడు.

నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (34 నాటౌట్), ఖురేషీ (26 నాటౌట్) క్రీజులో ఉన్నారు. చివరి రోజు ఆట నామమాత్రమే కాగా, ఈస్ట్ జోన్ విజయం లాంఛనమేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

### సంక్షిప్త స్కోర్లు:

ఈస్ట్ జోన్: 708 ఙ 212/5 (ఇషాన్ కిషన్ 80, శిఖర్ మోహన్ 52)

సౌత్ జోన్: 336 (తిలక్ వర్మ 99, ముఖేష్ కుమార్ 3/62)

# యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం

## అల్కరాజ్‌కు షాకిచ్చిన షెల్టన్..



టెన్నిస్ ప్రపంచంలో పెను సంచలనం నమోదైంది. యూఎస్ ఓపెన్ డిఫెండింగ్ ఛాంపియన్, స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్‌కు అమెరికా యువ కెరటం బెన్ షెల్టన్ భారీ షాకిచ్చాడు. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్ పోరులో అద్భుతమైన ఆటతీరుతో అల్కరాజ్‌ను మట్టికరిపించి సెమీ ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. ఈ ఉత్కంఠభరిత పోరుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. బుధవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. మొత్తం 4 గంటల 28 నిమిషాల పాటు సాగిన ఈ ఐదు సెట్ల థ్రిల్లర్‌లో షెల్టన్ 6-7(5), 6-1, 6-3, 1-6, 7-6(10/7) తేడాతో అల్కరాజ్‌పై విజయం సాధించాడు. నిర్ణయాత్మక ఐదో సెట్ టైబ్రేక్‌కు దారితీయగా, షెల్టన్ తన నరాలపై పూర్తి నియంత్రణతో ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నాడు. 146 మైళ్ల వేగంతో ఏస్ సంధించి మ్యాచ్‌ను ముగించాడు. యూఎస్ ఓపెన్ చరిత్రలోనే అత్యంత ఆలస్యంగా ముగిసిన మ్యాచ్‌గా ఇది రికార్డు సృష్టించింది. ఈ మ్యాచ్ తెల్లవారుజామున 3.33 గంటలకు ముగిసింది. గతంలో ఈ రికార్డు కూడా అల్కరాజ్ (అర్ధరాత్రి తర్వాత 2.50 గంటలకు ముగిసింది) పేరు మీదే ఉండటం గమనార్హం. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌ను ఉద్దేశించి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 'ఎక్స్' వేదికగా స్పందించాడు. "ఇది అద్భుతమైన టెన్నిస్! ఒకరు మ్యాచ్ గెలుస్తారనుకున్న ప్రతిసారీ, మరొకరు అద్భుతంగా పుంజుకున్నారు. చివరికి కొన్ని పాయింట్ల తేడాతో ఫలితం తేలింది. అద్భుతంగా ఆడావు బెన్ షెల్టన్! కార్లోస్, ఇది కఠినమైన ఓటమి. గాయం తర్వాత పునరాగమనం చేసి ఆడటం వల్ల ఇది మరింత కష్టంగా ఉంటుంది" అని పోస్ట్ చేశాడు. ఈ విజయంతో అల్కరాజ్ 18 మ్యాచ్‌ల గ్రాండ్‌స్లామ్ విజయ పరంపరకు షెల్టన్ అడ్డుకట్ట వేశాడు. ఇది షెల్టన్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలిచింది. గాయం కారణంగా సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగిన అల్కరాజ్.. రోజర్ ఫెదరర్ తర్వాత యూఎస్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకున్న ఆటగాడిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. కానీ, క్వార్టర్స్‌లోనే అతని ప్రయాణం ముగిసింది. మాంట్రియల్‌లో తన రెండో ఏటీపీ మాస్టర్స్ 1000 టైటిల్ గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న షెల్టన్.. 2023 తర్వాత మళ్లీ యూఎస్ ఓపెన్ సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో మరో అమెరికన్ ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫోతో తలపడనున్నాడు. వీరిద్దరూ తమ తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ బెర్త్ కోసం పోటీ పడనున్నారు. ఈ విజయంతో ఈ ఏడాది యూఎస్ ఓపెన్‌లో బెన్ షెల్టన్ అతిపెద్ద ఆకర్షణగా నిలిచాడు.



# పాండ్యా రీఎంట్రీకి రంగం సిద్ధం

## ఆస్ట్రేలియాతో భారత్-ఏ సిరీస్‌కు స్టార్ ఆల్‌రౌండర్!

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైంది. 'ఆస్ట్రేలియా-ఏ'తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన 'భారత్-ఏ' జట్టులో పాండ్యాకు చోటు దక్కింది. అయితే అతడి రీఎంట్రీ ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గడంపై ఆధారపడి ఉంది. గాయాల కారణంగా పాండ్యా కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు. అందులో పాస్ అయితే ఆస్ట్రేలియా-ఏతో వన్డే సిరీస్‌లో ఆడనున్నాడు. సుమారు ఐదు నెలల తర్వాత పాండ్యా తిరిగొచ్చే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా-ఏతో భారత్-ఏ రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు, మూడు వన్డేలు ఆడనుంది. సెప్టెంబర్ 22 నుంచి పుదుచ్చేరిలో సిరీస్ మొదలవుతుంది. నాలుగు రోజుల మ్యాచ్‌లకు దేవదత్ పడిక్కల్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. వన్డే జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించనున్నాడు. పడిక్కల్ అతడికి డిప్యూటీగా ఉంటాడు. వన్డే జట్టులో పాండ్యాతో పాటు సాయి సుదర్శన్, రజత్ పాటిదార్, ప్రియాన్ష్ ఆర్య, నమన్ ధీర్ వంటి ఆటగాళ్లకు చోటు దక్కింది. పాండ్యా ఫిట్‌గా తేలితే భారత్-ఏకు అతడి ఆల్‌రౌండ్ సామర్థ్యం అదనపు బలంగా మారనుంది. వన్డే మ్యాచ్‌లు అక్టోబర్ 6, 9, 11 తేదీల్లో జరగనున్నాయి. పాండ్యా ఫిట్‌నెస్ పరీక్షలో ఎలా రాణిస్తాడన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# న్యూజిలాండ్‌లో టీమిండియా క్రేజ్..


## హాట్ కేకుల్లా అమ్ముడవుతున్న టికెట్లు!

న్యూజిలాండ్‌లో భారత క్రికెట్ జట్టు పర్యటనకు ముందే అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఆరేళ్ల విరామం తర్వాత టీమిండియా అక్కడ పర్యటిస్తుండటంతో టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఈ అంతర్జాతీయ హోమ్ సమ్మర్ సీజన్ కోసం ఇప్పటికే 50,000కు పైగా టికెట్లు అమ్ముడయ్యాయని న్యూజిలాండ్ క్రికెట్ అధికారికంగా ప్రకటించింది. దీంతో సిరీస్‌పై ఉన్న అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టమవుతోంది. భారత జట్టు అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే, అభిమానుల నుంచి ముఖ్యంగా టీ20 మ్యాచ్‌లకు భారీ డిమాండ్ కనిపిస్తోంది. క్రైస్ట్‌చర్చ్‌లో జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌కు సంబంధించి ఇప్పటికే 75 శాతం టికెట్లు అమ్ముడుపోయాయని న్యూజిలాండ్ క్రికెట్ తెలిపింది. టికెట్ల అమ్మకాలు ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే ఈ స్థాయి స్పందన రావడం విశేషం. అభిమానుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఈడెన్ పార్క్ స్టేడియంలో ఆరో అంతస్తు (సిక్స్ టైర్) సీటింగ్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు న్యూజిలాండ్ క్రికెట్ ప్రకటించింది. అక్టోబర్ 30న జరిగే నాలుగో టీ20 మ్యాచ్ కోసం ఈ అదనపు సీట్లను కేటాయించారు. భారత్ 2019లో పర్యటించిన తర్వాత ఈడెన్ పార్క్‌లో ఈ స్థాయి సీటింగ్ తెరవడం ఇదే తొలిసారి. గతంలో 2015 ప్రపంచకప్, 2018లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ సందర్భంగా మాత్రమే ఇలా అదనపు సీట్లను తెరిచారు. ఇటీవలే ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్, న్యూజిలాండ్ తలపడటంతో ఈ టూర్‌పై మరింత ఆసక్తి పెరిగింది. టికెట్ల అమ్మకాలపై న్యూజిలాండ్ క్రికెట్ హెడ్ ఆఫ్ మార్కెటింగ్ టిమ్ ఎల్లిస్ మాట్లాడుతూ.. "భారత్ పర్యటనపై నెలకొన్న ఉత్సాహానికి ఈ స్పందనే నిదర్శనం. ఏళ్ల తర్వాత ఈడెన్ పార్క్‌లో టాప్ లెవల్ సీటింగ్‌ను తెరవడం చాలా ఆనందంగా ఉంది. అభిమానులకు అద్భుతమైన అనుభూతిని అందించడానికి మ్యాచ్‌ల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ప్లాన్ చేస్తున్నాం" అని వివరించారు. ఈ పర్యటనతోనే న్యూజిలాండ్ అంతర్జాతీయ హోమ్ సీజన్ ప్రారంభం కానుండగా, ఆ తర్వాత బంగ్లాదేశ్ మహిళల జట్టు అక్కడ పర్యటించనుంది.




# నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న 'మండాడి'

సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'మండాడి' నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి ఈ సినిమాను అత్యంత భారీ ఎత్తున విడుదల చేస్తోంది. తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకి యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. మూవీ చూసిన సెన్సార్ టీం సభ్యులు అద్భుతంగా వచ్చిందని అభినందించారు. ముఖ్యంగా ఇందులో వచ్చే బోట్ సీక్వెన్సెస్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయని, థియేటర్లలో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టడం ఖాయమని కొనియాడారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, మైండ్ బ్లోయింగ్ ట్రైలర్ సినిమాపై హైప్‌ను రెట్టింపు చేశాయి. మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఎస్.ఆర్. కథిర్ విజువల్స్ ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో గ్రాండ్‌గా, విజువల్ ఫీస్ట్‌లా మలిచాయి. పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బరాయన్, మహేష్ మాథ్యూ కంపోజ్ చేసిన యాక్షన్ సీక్వెన్సులు మాస్, యాక్షన్ ప్రియులను థ్రిల్ చేయనున్నాయి. స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించడం ఈ ప్రాజెక్ట్‌కి బలాన్ని చేకూర్చింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ అవుతున్న ఈ చిత్రానికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్భుతంగా జరుగుతున్నాయి. బుక్ మై షోలో ప్రతి గంటకూ వేలాది టికెట్లు అమ్ముడవుతుండటం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. సుహాస్, సూరి ఇద్దరి కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించే చిత్రంగా నిలవబోతోంది.




# 'రణబాలి'లో యోధుడిగా విజయ్

విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'రణబాలి'. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 1854-1878ల నాటి బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో, రాయలసీమ ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. ఇందులో విజయ్ పవర్‌ఫుల్ యోధుడిగా కనిపిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా కానుకగా విడుదల కానుంది. వారు ఆ కథను పాతిపెట్టారు.. వారు ఆ పేరును చెరిపివేశారు. వారు తమ పాపాలను తుడిచిపెట్టారు. కానీ అతని రౌద్రాగ్నిని మాత్రం ఎప్పటికీ పాతిపెట్టలేకపోయారు. జానపద గాథలు, చరిత్ర అతన్ని ఎప్పటికీ మరువవు. రణబాలి.. ఆ యోధుడి ప్రతిజ్ఞ" అని మేకర్స్ పేర్కొన్నారు. "అతిథులుగా వచ్చి, అణచివేతదారులుగా మిగిలిపోయిన వారిని. రక్తం చిందించాలని నిర్ణయించుకున్న మన గ్రామాల్లోని ఆ మనుషులను.. ఎప్పటికీ మర్చిపోవద్దు" అని విజయ్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. 1854 - 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రను రష్మిక పోషించారు. అజయ్ - అతుల్ సంగీతం సమకూర్చగా.. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. 'రణబాలి' చిత్రాన్ని టీ-సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని ఒ వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్ - రష్మిక కలిసి నటిస్తున్న సినిమా ఇది. భార్యాభర్తలుగా మారిన తర్వాత విరోష్ నుంచి రాబోయే తొలి సినిమా కావడంతో అభిమానులు ఎగ్జైటెడ్ గా ఉన్నారు.



# భన్సాలీతో కలిసి పనిచేయబోతున్నారా?



బాలీవుడ్ నటి కరీనా కపూర్ మరియు ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత ఒక కొత్త ప్రాజెక్ట్ పై చర్చలు జరుగుతున్నాయా? ఇటీవల కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఈ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజమైతే, కరీనా మరియు భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత జరిగే మొదటి సహకారం అవుతుంది, ఎందుకంటే వారు 'దేవదాస్' సినిమా సమయంలో ఒక గొడవకు గురయ్యారు. సెప్టెంబర్ 8న కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు పాస్టెల్ బ్లూ సూట్ ధరించి కనిపించింది. ఆమె పాపారాజ్జీకి ఫోటోలకు నిలబడలేదు. సంజయ్ లీలా భన్సాలీ తన తదుపరి చిత్రంలో మహిళా నాయకత్వ పాత్ర కోసం కరీనాను సంప్రదించినట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమె తమిళ నటుడు ధనుష్‌తో కలిసి నటించనుంది, అయితే అన్ని విషయాలు బాగా జరిగితేనే. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు ఆమెకు ముఖ్యమైన పాత్ర ఉండబోతుంది. కరీనా ఈ చిత్రానికి ఆసక్తి చూపించినప్పటికీ, ఆమె ఇంకా సంతకం చేయలేదు. ఆమె తేదీలు, ఫీజులు మరియు ఇతర వివరాల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం ఒక పౌరాణిక సాహస కథగా ఉంటుందని సమాచారం, ఇది అటవీ ప్రాంతంలో జరుగుతుంది. కథ అధికారికంగా వెల్లడించబడలేదు, కానీ ఈ చిత్రంలో ఒక ఏనుగు ముఖ్యమైన పాత్ర పోషించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. భన్సాలీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు, కాగా పి.ఎస్. మిత్రన్ దీనిని దర్శకత్వం వహించనున్నారు. ప్రాజెక్ట్ ప్రస్తుతం రచనలో ఉంది, ప్రీ-ప్రొడక్షన్ ఈ సంవత్సరం చివర్లో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. షూటింగ్ 2027 జనవరిలో ప్రారంభమవుతుందని సమాచారం. కరీనా ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేస్తే, ఇది ఆమె మరియు భన్సాలీ మధ్య ఉన్న బాలీవుడ్‌లోని అత్యంత చర్చించబడిన వృత్తి గొడవను ముగించగలదు. కరీనా కపూర్ మరియు సంజయ్ లీలా భన్సాలీ మధ్య గొడవ 2000ల ప్రారంభంలో ప్రారంభమైంది, ఆ సమయంలో కరీనా 'దేవదాస్' చిత్రంలో పారో పాత్ర కోసం పరిశీలనలో ఉన్నది. కరీనా ఈ పాత్ర కోసం స్క్రీన్ టెస్ట్ చేసింది మరియు సంతకం చేసిన మొత్తాన్ని కూడా పొందింది. అయితే, ఈ పాత్ర చివరకు ఐశ్వర్య రాయ్ బచ్చన్‌కు వెళ్లింది, ఆమె 2002లో షారుక్ ఖాన్‌తో కలిసి నటించింది. కరీనా ఈ సంఘటనపై ఎంత బాధపడిందో గురించి మాట్లాడింది. ఒక పాత ఫిల్మ్‌ఫేర్ ఇంటర్వ్యూలో, ఆమె భన్సాలీతో పని చేయనని చెప్పింది. "నేను ఎప్పుడూ చేయను. ఆయన నాకు చేసినది తప్పు. ఆయన నాకు 'దేవదాస్' కోసం స్క్రీన్ టెస్ట్ ఇచ్చారు, సంతకం చేసిన మొత్తాన్ని ఇచ్చారు, తరువాత మరొకరిని తీసుకున్నారు. అది తప్పు, ఇది నాకు బాధ కలిగించింది, ఎందుకంటే నేను నా కెరీర్ ప్రారంభంలో ఉన్నాను. అది సరే, ఎందుకంటే ఆయన నన్ను విడిచిపెట్టిన రోజు నేను 'యాదెయిన్'కి సంతకం చేశాను. సంజయ్ నన్ను బాధపెట్టాడు. నేను పని లేకపోయినా, ఆయనతో పని చేయను" అని కరీనా చెప్పింది.

# మారేమ్మకు ఏ సర్టిఫికెట్ జారీ!

మాస్ మహారాజ రవితేజ ఇటీవల 'ఇరుముడి' మూవీతో కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఇరుముడి మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ఇప్పుడు రవితేజ తమ్ముడి కొడుకు మాధవ్ హీరోగా పరిచయం అవుతూ చేస్తున్న చిత్రం మారెమ్మ. ఈ మూవీ కూడా డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ట్రైలర్ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 10వ తేదీన గ్రాండ్ గా రిలీజ్ అవుతోంది. ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహించారు. అలాగే మోక్ష ఆర్ట్స్ పతాకంపై మయూర్ రెడ్డి బండారు నిర్మించారు. మారెమ్మ చిత్రంలో మాధవ్ సరసన హీరోయిన్ గా తమిళ బ్యూటీ దీపా బాలు నటించింది. వీరితో పాటు ఈ మూవీలో వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపాలక్ష్మి, దయానంద్ రెడ్డి వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక మారెమ్మ చిత్రం ఇటీవల సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకుంది. ఈ చిత్రం రన్ టైమ్ 2 గంటల 15 నిమిషాలు అంటే.. 135 నిమిషాలుగా ఉంది. తక్కువ రన్ టైమ్ కావడంతో సినిమా చాలా గ్రిప్పింగ్ గా ఉంటుందని తెలుస్తోంది. అనవసరమైన వాటికి పోకుండా స్ట్రెయిట్ గా పాయింట్ చెప్పే ప్రయత్నం చిత్ర యూనిట్ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీకి సెన్సార్ బృందం ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అంటే 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే ఈ సినిమా చూసేందుకు అర్హులని అర్థం. ఇక మారెమ్మ సినిమా మిగతా సినిమాల మాదిరి కాదు.. గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ డివోషనల్ థ్రిల్లర్ కథే ఈ సినిమా. పెంపుడు జంతువులు, మానవుల మధ్య సంబంధాలను ఈ మూవీ ద్వారా సరికొత్తగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు దర్శకుడు మంచాల నాగరాజు. వరంగల్ జిల్లాలోని మహిషాపురం అనే గ్రామంలో ఈ మూవీ స్టార్ట్ అవుతుంది. ఆ ఊరిలో ప్రమాదకరమైన వ్యాధి సోకి అంతా చనిపోతుంటారు. ప్రజలంతా భయంతో ఉన్న సమయంలో ఆ ఊరిలో ఓ దున్నపోతు జన్మిస్తుంది. అయితే దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని ఓ జ్యోతిష్యుడు చెబుతాడు. ఆ దున్నపోతుకు మారెమ్మ అని పేరు పెట్టి దేవతగా భావిస్తారు ప్రజలు. అయితే ఆ దున్నపోతును చూసుకునే బాధ్యత పశువుల కాపరి అయిన మారి(మాధవ్ భూపతిరాజు) కు ఇస్తారు. అయితే అనుకోని సంఘటనల కారణంగా ఆ దున్నపోతు కనిపించకుండా పోతుంది. ఆ తర్వాత ఏం జరిగింది..? అనేదే స్టోరీ. డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కథాంశం కావడంతో ఈ మూవీతో మాధవ్ హిట్ కొట్టాడని సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక ఫుల్ రివ్యూ కావాలంటే సెప్టెంబర్ 10 వరకు ఆగాల్సిందే.

# ఒకవైపు కూతురిగా.. మరొకవైపు హీరోయిన్‌గా..

అనస్వర రాజన్.. మలయాళ బ్యూటీగా తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయికగా మంచి పేరు సొంతం చేసుకొంది. ఇప్పటికే వరుసగా తెలుగులో అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిన ఈమె.. తాజాగా మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టాలీవుడ్ లో మోస్ట్ అవైటెడ్ చిత్రాలలో ఒకటిగా నిలిచిన 'కాకా' మూవీలో ఈమె అవకాశం దక్కించుకుంది. నేడు ఈమె పుట్టినరోజు కావడంతో కాకా మూవీ నుండి ఒక స్పెషల్ పోస్టర్ ను పంచుకుంటూ మేకర్స్ ఈమెకు ప్రత్యేక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబి కొల్లి కాంబినేషన్లో వస్తున్న కాకా మూవీలో అనస్వర రాజన్ చిరంజీవి కూతురు "అమ్ములు" పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. తండ్రీకూతుళ్ళ అనుబంధం సినిమాకు కీలకమైన ఎమోషనల్ పాయింట్ గా ఉండే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో అనస్వర రాజన్ ఎంబిబిఎస్ స్టూడెంట్ గా సింపుల్ లుక్ లో కనిపించారు. ఇకపోతే అనస్వర ఈ సినిమాలో చిరంజీవికి కూతురుగా నటించబోతోంది అని ప్రకటించడంతో అటు హీరోయిన్గా చేస్తున్న సినిమాల విషయాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342